
www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 012 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com ఆదివారం 26 - 04 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool


బాలికలపై లైంగిక వేధింపులు.. అమెరికాలో ఖమ్మం వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష

## ఏపీలోని పలు జిల్లాల్లో
# పెట్రోల్, డీజిల్ కొరత

- ఉమ్మడి గోదావరి, కర్నూలు, నంద్యాల వంటి జిల్లాల్లో పెట్రోల్ కొరత
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, రైతులు
- సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఎస్, పౌర సరఫరా అధికారులకు సీఎం ఆదేశం
- పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో మాట్లాడిన సీఎం
- ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల యజమానులతో మాట్లాడాలని అధికారులకు సూచన



**అమరావతి :**
రాష్ట్రంలోని ఉమ్మడి గోదావరి, కర్నూలు, నంద్యాల వంటి జిల్లాల్లో పెట్రోల్ బంకులు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి, కీలక ఆదేశాలు జారీ చేశారు.వరి కోతల సమయంలో డీజిల్ దొరక్కపోవడంతో యంత్రాలు పొలాల్లోనే నిలిచిపోయాయి. అటు ఆక్వా రైతులు కూడా ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడంతో ఆయిల్ కంపెనీలు సరఫరాను నియంత్రించాయి. దీనికి తోడు కంపెనీలు క్రెడిట్ ఆప్షన్‌ను రద్దు చేయడం, పాత బకాయిలు ఉన్న బంకులకు స్టాక్ నిలిపివేయడం - మిగతా 2 లో

## జూన్ నాటికి అనకాపల్లి వరకు
# పోలవరం జలాలు



- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- ఉత్తరాంధ్ర నీటి సమస్యలు తీర్చడంలో గోదావరి జలాలు అత్యంత కీలకమన్న నిమ్మల
- జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జల్లాలు తరలించాలని సీఎం ఆదేశించారని వెల్లడి
- పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని ఏజెన్సీలకు వార్నింగ్

**అమరావతి :**
ఉత్తరాంధ్ర జిల్లాల సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో గోదావరి జలాలు అత్యంత కీలకమని, ఈ నీటిని తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జూన్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి, అనకాపల్లి - మిగతా 2 లో


2 లో

# ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అస్వస్థత

- ఆసుపత్రిలో చేరిక!
- అర్ధరాత్రి 2 గంటలకు బెంగళూరు నుంచి విజయవాడ చేరుకున్న గవర్నర్
- తెల్లవారుజామున తీవ్ర కడుపు నొప్పితో బాధపడ్డ వైనం
- మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు

## పోలీసుల ఎదుట 47 మంది
# మావోల లొంగుబాటు



- ఇదే చివరి బ్యాచ్...!
- హైదరాబాద్‌లో 47 మంది మావోయిస్టుల సామూహిక లొంగుబాటు
- డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగించిన మావోలు
- 'ఆపరేషన్ కగార్' విజయంతోనే ఇది సాధ్యమైందని వెల్లడి
- లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే
- ఆయుధాలు వీడి జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు

**హైదరాబాద్ :**
తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఏకంగా 47 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఈ లొంగుబాటు జరిగింది. ఈ సందర్భంగా వారు 34 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో - మిగతా 2 లో

# జర్మనీలో ప్రారంభమైన 'సోలిస్100'

- బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా జీవనం
- జర్మనీలో 100 రోజుల ఐసోలేషన్ ప్రయోగం ప్రారంభం
- ఆరుగురు వలంటీర్లు ప్రత్యేక గదిలో ఒంటరిగా జీవనం
- సుదీర్ఘ అంతరిక్ష యాత్రలలో మానసిక స్థితిపై అధ్యయనం దీని లక్ష్యం
- యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 'సోలిస్100' మిషన్
- చంద్రుడు, అంగారకుడిపై యాత్రలకు ఈ ఫలితాలు కీలకం



**హైదరాబాద్ :**
సుదీర్ఘ అంతరిక్ష యాత్రలలో మానవులు ఎదుర్కొనే తీవ్రమైన సవాళ్లను అర్థం చేసుకునేందుకు శాస్త్రవేత్తలు ఒక అరుదైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జర్మనీలో ఆరుగురు వలంటీర్లు 100 రోజుల పాటు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఒక ప్రత్యేక గదిలో ఒంటరిగా జీవించనున్నారు. భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపైకి చేపట్టే యాత్రల కోసం మానసికంగా, శారీరకంగా వ్యోమగాములను సిద్ధం చేయడంలో ఈ ప్రయోగం కీలకం కానుంది.యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జర్మన్ ఏరోస్పేస్ సెంటర్‌లోని కొలోన్ నగరంలో ఉన్న అత్యాధునిక పరిశోధన కేంద్రం 'ఎన్విహాబ్'లో ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. 'సోలిస్100' (సొలొ×సొ100) అని పిలుస్తున్న ఈ మిషన్‌లో భాగంగా, ఎంపికైన ఆరుగురు - మిగతా 2 లో


2 లో

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు


- మే 9న తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ
- పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ
- బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశం



2 లో

## 'పేటీఎం బ్యాంక్'
# లైసెన్స్ రదు

- పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేసిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే ప్రధాన కారణమని ఆర్బీఐ వెల్లడి
- యూపీఐ, క్యూఆర్ కోడ్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం ఉండదని పేటీఎం ప్రకటన



2 లో

# ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె అన్నీ లెక్కిస్తాం

- జనగణన తెలంగాణ డైరెక్టర్
- తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామన్న తెలంగాణ డైరెక్టర్
- ఒక భవనంలో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడి
- 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం

- తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్
- రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపామని వెల్లడి
- కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు అంగీకరించినట్లు వెల్లడి



**హైదరాబాద్ :**
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై - మిగతా 2 లో

## కవిత కొత్త పార్టీ..
# 'తెలంగాణ రాష్ట్ర సేన'

- కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు
- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన కవిత
- బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్న ఆరోపణ
- కేసీఆర్ మారిపోయారని, ఆయన మన మనిషి కాదంటూ తీవ్ర విమర్శలు
- సామాజిక తెలంగాణే లక్ష్యమని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా
- తప్పకుండా తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేసిన కవిత




**హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో తన పార్టీని ప్రకటించి, రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆమె పార్టీ పేరును, జెండాను ఆవిష్కరించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో కూడిన జెండా మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై టీఆర్ఎస్ అనే అక్షరాలు ఉన్నాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కవిత మాట్లాడుతూ - మిగతా 2 లో

# సంపాదకీయం

## కొత్త భాష్యం

ప్రయాణికుల భద్రతను ప్రాథమిక హక్కు స్థాయికి పెంచి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు విశేషమైనది. వారి భద్రత కేవలం విధానపరమైన వ్యవహారం కాక, ఆర్టికల్ 21లో అంతర్భాగమని కోర్టు స్పష్టంచేసింది. తద్వారా క్షేమకరమైన మౌలికసదుపాయాల ఏర్పాటునుంచి ప్రమాదాల నివారణకు బాధ్యత పడటం వరకూ ప్రభుత్వం జవాబుదారీ అవుతుంది. జీవించే హక్కు కేవలం ఒక వ్యక్తి భౌతిక ఉనికికి పరిమితం కాబోదని, సురక్షితమైన వాతావరణంలో జీవించడం కూడా అందులో భాగమని కోర్టు స్పష్టంచేసింది. అందువల్ల, రోడ్లవంటి మౌలిక సదుపాయాలు కల్పించిన ప్రభుత్వంపైన ఆ సదుపాయాలు పౌరుడి ప్రాణాలకు ముప్పు తెచ్చిపెట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుందన్నది సారాంశం. ఇలా భద్రతను ప్రాథమికహక్కుగా ప్రకటించడం ద్వారా న్యాయస్థానం ప్రయాణికుడి రక్షణను రాజ్యంపైన పెట్టింది. అంటే, మౌలిక సదుపాయాల నిర్వహణలో నిర్లక్ష్యం ఇకపైన కేవలం తప్పిదంగా కాక, పౌరుడి ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుంది. ప్రయాణికుల భద్రతను పాలన, విధానపరమైన అంశం నుంచి ప్రాథమిక హక్కు స్థాయికి పెంచడం వల్ల న్యాయస్థానాలను ఆశ్రయించగలిగే అధికారం కూడా వ్యక్తికి హెచ్చినట్టే. హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించి ఆయా రహదారుల్లో తనకు క్షేమకరంగా లేని పరిస్థితులపై ఫిర్యాదులు చేయవచ్చు, ప్రమాదకరంగా పరిణమించిన రోడ్లకు మరమ్మత్తులు, మెరుగుదల డిమాండ్ చేయవచ్చు.గత ఏడాది నవంబరులో జరిగిన రెండు రోడ్డుప్రమాదాలను సుప్రీంకోర్టు సూమోటోగా స్వీకరించిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. నవంబరు 2న రాజస్థాన్‌లోని ఫలోడీలో జరిగిన రోడ్డుప్రమాదంలో పదిహేనుమంది ప్రాణాలు కోల్పోయి, అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆ మర్నాడే రంగారెడ్డి జిల్లాలో మరో ఘోరం జరిగింది. తాండూరు నుంచి హైదరాబాద్ వెడుతున్న ఆర్టీసీ బస్సును కంకరలోడ్‌తో ఉన్న లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో పదిమంది మహిళలు, ఒక చిన్నారి సహా 19మంది మరణించారు. వ్యవస్థాగత నిర్లక్ష్యాన్ని, సదుపాయాల లేమిని ప్రశ్నిస్తూ ఈ కేసులో సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. నిర్దేశిత విశ్రాంతి స్థలాల్లో తప్ప, జాతీయ రహదారులపై భారీ వాణిజ్యవాహనాల పార్కింగ్ నిషేధం సహా అనేక మార్గదర్శకాలను ప్రకటించింది. హైవేలపై అధునాతన ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలు, జీపీఎస్ ఆధారిత చిత్రాలు, ఈ--చలాన్ ద్వారా ఉల్లంఘనల కట్టడి, రహదారుల అంచుల్లో వ్యాపార, వాణిజ్య కట్టడాల నిర్మాణంపై నిషేధం వంటివి ఇందులో ఉన్నాయి. ప్రమాదాల నివారణకు ఆధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు కోర్టు సూచించింది. జాతీయ రహదారుల వెంబడి ఉన్న అన్ని అక్రమ కట్టడాలను 60రోజుల్లోగా కూల్చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. జాతీయ రహదారులు ఉన్న జిల్లాలన్నీ పక్షంరోజుల్లోగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకొని రోడ్లను నిరంతరం పర్యవేక్షించాలి. తద్వారా జిల్లా పరిధిలో జరిగే ప్రమాదాలకు ఆయా అధికారులదే బాధ్యత. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చేయవలసినదేమిటో కూడా కోర్టు వివరంగా చెప్పింది. మొత్తంగా, రోడ్డుప్రమాదాలను నివారించడానికి డజనుపైనా మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు, రెండునెలల అనంతరం వీటి ఆచరణను సమీక్షిస్తానని హెచ్చరించింది కూడా.సుప్రీం ఆగ్రహానికీ, ఆవేదనకు బలమైన కారణం ఉంది. దేశంలో జాతీయ రహదారులు రెండుశాతమే అయినా, మొత్తం ప్రమాదాల్లో ముప్పై ఒక్కశాతం వాటిమీదే జరుగుతున్నాయి. 36శాతం మరణాలు అక్కడే సంభవిస్తున్నాయి. ఇందుకు అతివేగమే కారణమని పలు నివేదికలు తేల్చినందున వేగాన్ని నియంత్రించే విధానాలపైన కూడా కోర్టు ప్రత్యేక దృష్టిపెట్టింది. నాలుగులేన్లు, ఆరులేన్లకు రోడ్లను విస్తరిస్తున్న ప్రభుత్వాలు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం లేదు. దీనికితోడు, లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పర్మిట్ల విషయంలో అధికారుల అవినీతి సైతం ప్రమాదాలను పెంచుతున్నాయి. వాహనదారుల అతివేగం, బాధ్యతారాహిత్యం, తోటిప్రయాణికుల పట్ల నిర్లక్ష్యం, మద్యం తాగి నడపడం వంటివి యాక్సిడెంట్లకు కారణమవుతున్నాయి. ఇక, రహదారుల నిర్మాణంలో ఇంజనీర్ల తప్పులు చాలా ప్రమాదాలకు దారితీస్తున్నాయి. నిముషానికో రోడ్డు ప్రమాదం, రోజూ నాలుగువందలయాభై మరణాలు సంభవిస్తున్న ఈ దేశంలో సుప్రీంకోర్టు చొరవతోనైనా పరిస్థితిలో మార్పు వస్తే సంతోషం.

## కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన'

**మొదటిపేజీ తరువాయి -** బీఆర్ఎస్ పార్టీ, దాని నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను పూర్తిగా కోల్పోవడం వల్లే తాను కొత్త పార్టీ పెట్టాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ అభివృద్ధి రథం గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన కొన్ని తప్పుల్లో భాగస్వామినేనని అంగీకరిస్తూ, ఇప్పుడు ఆ తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు."ప్రస్తుతం ఉన్న కేసీఆర్ ఒకప్పటి కేసీఆర్ కాదు. ఆయన 'మర మనిషి'గా మారిపోయారు, మన మనిషి కాదు. ఆయన గుంట నక్కల చేతిలో ఖైదీగా మారారు" అంటూ కవిత తన తండ్రిపై సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రజలు కష్టాల్లో ఉంటే కేసీఆర్ పట్టించుకోవడం లేదని, అధికారం ముందు మమకారం తగ్గిపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాను హెచ్చరించినా, తనను పక్కనపెట్టి 'పందికొక్కులను' అందలం ఎక్కించారని మండిపడ్డారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచి పని చేశారని, ఇప్పుడు తన రాష్ట్రం కోసం స్వేచ్ఛగా పోరాడతానని అన్నారు.సామాజిక తెలంగాణ సాధనే తమ పార్టీ లక్ష్యమని కవిత ప్రకటించారు. రాష్ట్రంలోని మూడున్నర కోట్ల మందికి 'అమ్మ'గా మారి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాము ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, రెండేళ్లలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాను తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేశారు. పార్టీ ప్రకటనకు ముందు కవిత తన బంజారాహిల్స్ నివాసంలో సర్వమత ప్రార్థనలు చేసి, గన్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.




## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం

**మొదటిపేజీ తరువాయి -** మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు.ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని



పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

## జూన్ నాటికి అనకాపల్లి వరకు పోలవరం జలాలు

**మొదటిపేజీ తరువాయి -** వరకు గోదావరి జలాలను తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల సమీపంలో నేషనల్ హైవే క్రాసింగ్ వద్ద జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆయన, అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ఏజెన్సీలను హెచ్చరించారు. ముఖ్యంగా హైవే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి ఆరోపించారు. జగన్




ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలపై కక్ష గట్టి పనులను ప్రీ-క్లోజర్ చేసిందని, కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించి ప్రాంతీయ ప్రయోజనాలకు గండికొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును, రెండో ప్రాధాన్యతగా ఈ ఎడమ కాలువను సందర్శించారని గుర్తుచేశారు.ప్రస్తుతం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి పనులను పరుగులు పెట్టిస్తున్నామని, ఇప్పటివరకు 76 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం వల్ల 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే మరో 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మందికి శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు.అలాగే పాయకారావుపేట ఎగువన ఉన్న 98 ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాలకు నీరందుతుందని పేర్కొన్నారు. కుమ్మరిలోవ నిర్వాసితులకు రూ.30.38 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వెల్లడించిన మంత్రి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

## ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె అన్నీ లెక్కిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ప్రతి నిర్మాణాన్ని లెక్కలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఒక భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు.2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన మొదలయ్యేలోగా అన్నీ సిద్ధం చేస్తామని తెలిపారు. రెండో దశ జనగణనలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తారని తెలిపారు.ప్రతి ఇంటికి వెళ్లి జనగణనకు సంబంధించిన యాప్ ద్వారా 33 ప్రశ్నలను అడిగి వాటిని పూరిస్తారని చెప్పారు. జనగణనకు సంబంధించి ఒక ఇంటి నుంచి ఒక మొబైల్ నెంబర్ తీసుకుంటామని చెప్పారు. భాషను, ఇంటి పెద్దల వివరాలు సరిగ్గా ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, భాష, ఇంటి పెద్ద పేర్లను ఒకసారి నమోదు చేస్తే, వాటిని మార్చడానికి వీలుండదని తెలిపారు.

## ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అస్వస్థత

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ తెల్లవారుజామున అస్వస్థతకు గురయ్యారు. బెంగళూరు పర్యటన ముగించుకుని అర్ధరాత్రి 2 గంటలకు విజయవాడ చేరుకున్న ఆయనకు, తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో వెంటనే మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. ప్రయాణంలో విమానం ఆలస్యం కావడం, విశ్రాంతి లేకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారని, గవర్నర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

## ఏపీలోని పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత

**మొదటిపేజీ తరువాయి -** ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.పెట్రోల్, డీజిల్ సమస్య తీవ్రతరం అవుతుండటంతో, సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని సీఎస్, పౌరసరఫరాల అధికారులను సీఎం ఆదేశించారు. పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో కూడా మాట్లాడారు. స్టాకు లేని బంకుల వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల యజమానులతో మాట్లాడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని చెప్పారు.మరోవైపు, పెట్రోల్ స్టాక్ సమస్య ఉంటే వెంటనే ఆ బంక్ వారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు.

## పోలీసుల ఎదుట 47 మంది మావోల లొంగుబాటు

**మొదటిపేజీ తరువాయి -** అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని అధికారులు తెలిపారు.తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు చేపట్టిన ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడం, సాయుధ పోరాటంపై విరక్తి చెందడంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సామూహిక లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా ముగిసినట్లేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి ఇది గట్టి దెబ్బగా పరిగణిస్తున్నారు.ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ... ఇంత పెద్ద సంఖ్యలో మావోలు లొంగిపోయిన చివరి బ్యాచ్ బహుశా ఇదేనని, ఇకపై ఈ స్థాయిలో లొంగిపోవడానికి మావోయిస్టులు కూడా ఎక్కువ మంది లేరని అన్నారు."హింస ద్వారా ఏ సమస్య పరిష్కారం కాదు. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనంలోకి రావాలి" అని ఇంకా అజ్ఞాతంలో ఉన్న కొద్దిమంది మావోయిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే హెల్త్ కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

**మొదటిపేజీ తరువాయి -** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి.ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.

## జర్మనీలో ప్రారంభమైన 'సోలిస్100'

వలంటీర్లు ప్రత్యేకంగా నిర్మించిన నివాసంలోకి ప్రవేశించారు. రాబోయే మూడు నెలల పాటు వారు అక్కడే ఉంటూ, కఠినమైన నిబంధనలను పాటిస్తారు. అంతరిక్ష యాత్రలలో ఉండే ఒంటరితనం, ఒత్తిడి వంటి పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి వారిపై అధ్యయనం చేస్తారు. ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం.. సుదీర్ఘకాలం పాటు ఒంటరిగా ఉండటం వల్ల మానవ మనస్తత్వం, ఆరోగ్యం, పనితీరుపై ఎలాంటి ప్రభావం పడుతుందో తెలుసుకోవడమేనని ఈఎస్ఏ చీఫ్ సైంటిస్ట్ ఏంజెలిక్ వాన్ ఒంబర్‌జెన్ వివరించారు. వలంటీర్లలో ఒత్తిడి, అలసట, పనితీరు మందగించడం వంటి లక్షణాలను ముందుగానే గుర్తించడం ద్వారా, వ్యోమగాముల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.యూరప్‌లోని వివిధ దేశాల నుంచి ఎంపిక చేసిన 26 నుంచి 32 ఏళ్ల మధ్య వయసున్న ఈ ఆరుగురు వలంటీర్లపై శాస్త్రవేత్తలు విస్తృతమైన పరిశోధనలు చేస్తారు. వారి నిద్రపోయే సమయాలు, ఒత్తిడి స్థాయిలు, బృందంతో కలిసి పనిచేసే తీరు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వంటి అంశాలను నిశితంగా గమనిస్తారు. శారీరక మార్పులతో పాటు, వారు నివసించే గదిలోని సూక్ష్మజీవులలో వచ్చే మార్పులను కూడా అధ్యయనం చేస్తారు.ఈ ప్రయోగం ద్వారా లభించే ఫలితాలు భవిష్యత్ అంతరిక్ష యాత్రల ప్రణాళికలో కీలక పాత్ర పోషిస్తాయి. వ్యోమగాముల ఎంపిక, వారికి ఇచ్చే శిక్షణ పద్ధతులు, యాత్ర సమయంలో వారికి అవసరమైన మానసిక మద్దతు వంటివి రూపొందించడానికి ఈ అధ్యయన ఫలితాలు ఎంతగానో ఉపయోగపడతాయని పరిశోధకులు తెలిపారు. సుదూర గ్రహాలకు చేరుకోవడం



ఎంత ముఖ్యమో, ఆ ప్రయాణాన్ని మానవులు తట్టుకుని నిలబడటం కూడా అంతే ముఖ్యమని ఈ ప్రయోగం స్పష్టం చేస్తోంది.

## 'పేటీఎం బ్యాంక్' లైసెన్స్ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రద్దు చేసింది. కస్టమర్ల వివరాల సేకరణలో లోపాలు, నిబంధనల ఉల్లంఘనల కారణంగా రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆంక్షల ప్రక్రియ చివరికి లైసెన్స్ రద్దుతో ముగిసింది. డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా బ్యాంక్ కార్యకలాపాలు సాగాయని ఆర్బీఐ ఈ నిర్ణయానికి గల కారణాలను స్పష్టం చేసింది.పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ ఆంక్షలు 2022లోనే మొదలయ్యాయి. తొలుత కొత్త కస్టమర్లను చేర్చుకోవడాన్ని నిషేధించింది. ఈ ఏడాది జనవరిలో ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ కొత్త డిపాజిట్లు, క్రెడిట్ లావాదేవీలు, వ్యాలెట్ టాప్-అప్‌లను పూర్తిగా నిలిపివేసింది. 2024 మార్చి 15 నాటికి ఎలాంటి కొత్త నిధుల స్వీకరణను అనుమతించలేదు. దీంతో బ్యాంకింగ్ కార్యకలాపాలు దాదాపుగా స్తంభించిపోయాయి. అప్పటి నుంచి కేవలం ఖాతాల్లో ఉన్న నగదును విత్‌డ్రా చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఉంది. తాజా లైసెన్స్ రద్దుతో బ్యాంక్ కార్యకలాపాలు అధికారికంగా ముగిసినట్లయింది.ఈ సందర్భంగా ఆర్బీఐ కీలక వ్యాఖ్యలు చేసింది. "బ్యాంక్ యాజమాన్యం తీరు ప్రజా




ప్రయోజనాలకు, డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకును కొనసాగించడానికి అనుమతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు" అని తన ఉత్తర్వుల్లో పేర్కొంది.వన్97 కమ్యూనికేషన్స్, పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లో వరుసగా 51%, 49% వాటాలు ఉన్నాయి. 2015 ఆగస్టులో ఈ బ్యాంక్‌కు లైసెన్స్ లభించింది. నిబంధనల ప్రకారం ఈ బ్యాంక్ చిన్న మొత్తంలో డిపాజిట్లు స్వీకరించగలదు కానీ రుణాలు ఇవ్వలేదు.పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు తమ వ్యాపారంపై ఎలాంటి ఆర్థిక ప్రభావం చూపదని పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ స్పష్టం చేసింది. ఆర్బీఐ ఆంక్షల తర్వాత పేటీఎం తన ప్రధాన చెల్లింపుల సేవలను బ్యాంకింగ్ విభాగం నుంచి వేరు చేసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతితో భాగస్వామ్య బ్యాంకుల ద్వారా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను కొనసాగించడానికి అనుమతి పొందింది.పేటీఎం తన యూపీఐ హ్యాండిల్‌ను యెస్ బ్యాంక్ నేతృత్వంలోని మల్టీ-బ్యాంక్ వ్యవస్థకు మార్చింది. దీంతో కస్టమర్ల యూపీఐ చెల్లింపులు, క్యూఆర్ కోడ్ లావాదేవీలు, బిల్లు చెల్లింపులు వంటి రోజువారీ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. వీటికి ఎలాంటి అంతరాయం ఉండదు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు తమ ఖాతాల్లో ఉన్న బ్యాలెన్స్‌ను ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, కొత్తగా డబ్బు డిపాజిట్ చేయడం లేదా వ్యాలెట్ టాప్-అప్ చేయడంపై ఆంక్షలు కొనసాగుతాయి. మొత్తం మీద పేమెంట్స్ బ్యాంక్ మూతపడినప్పటికీ, పేటీఎం యాప్ ప్రధాన సేవలు నిరంతరాయంగా పనిచేస్తాయి.

## పూసుకునోళ్లకు పూసుకున్నంత... 'బర్నాల్' ఫొటోతో కవిత టీఆర్ఎస్ పార్టీ ట్వీట్

### టీఆర్ఎస్ పేరుతో కవిత పార్టీ ప్రకటన

### ఒరిజినల్ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ ట్వీట్

### బర్నాల్ ఫొటోలను పంచుకున్న కవిత టీఆర్ఎస్

కవిత స్థాపించిన 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పార్టీ 'ఎక్స్'లో ఖాతాను తెరిచింది. తాజాగా ఆ పార్టీ చేసిన పోస్టు ఆసక్తికరంగా మారింది. "పూసుకునోళ్లకు పూసుకున్నంత" అంటూ భారీ ట్రక్కులలో బర్నాల్ ఉన్నట్లుగా ఉన్న ఫొటోను సామాజిక మాధ్యమం వేదికగా పంచుకుంది. తమ పార్టీని, పార్టీ పేరును చూసి రగిలిపోయేవారికి బర్నాల్ అన్నట్లుగా ఈ ఫొటోను షేర్ చేసింది.అంతకుముందు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తన అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా ఆసక్తికర ట్వీట్ చేసింది. "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే" అంటూ అసలైన కోల్గేట్ పేస్టును, డూప్లికేట్ పేస్టును (కూల్‌గేట్ పేస్టు), అలాగే ఒరిజినల్ బిస్లరీ వాటర్ బాటిల్, డూప్లికేట్ వాటర్ బాటిల్‌ను (బ్రిస్లీ వాటర్ బాటిల్) బీఆర్ఎస్ పోస్టు చేసింది.కల్వకుంట్ల





కవిత మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 'తెలంగాణ రాష్ట్ర సేన' పార్టీని ప్రకటించారు. పాతికేళ్ల క్రితం కేసీఆర్ స్థాపించిన 'టీఆర్ఎస్' పేరు వచ్చేలా కవిత తన పార్టీ పేరును ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఒరిజినల్ ఒరిజినలే అని చేసిన ట్వీట్ చర్చకు దారి తీసింది. ఇప్పుడు కవిత టీఆర్ఎస్ పార్టీ బర్నాల్ ఫొటోను ట్వీట్ చేయడం ఆసక్తికరంగా మారింది.

## కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోరుకొండ మండలంలో చలివేంద్రాలు ఏర్పాటు





**గోకవరం,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం, కోరుకొండ, మండలంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మజ్జిగ, త్రాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసారు. కోరుకొండ –రాజమండ్రి ప్రధాన రహదారిలోని రామసేన కార్యాలయం వద్ద, జంబూపట్నం – నరసాపురం, గాదరాడ వెళ్లే రహదారిలోని జంబూపట్నం వినాయక అలయం వద్ద ఏర్పాటు చేసిన, మజ్జిగ, త్రాగ నీటి చలివేద్రాలను కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, శనివారం ప్రారంభించారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ప్రజల దాహార్తి తీర్చడం కోసం, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కంబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, నాగరమేష్, వీరాంజలి, రాయపాటి సత్యనారాయణ, పనగంటి రాంబాబు, చింతల కన్నారావు, పలకం శెట్టి శ్రీను, రామసేన సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## డాక్టరేట్ పొందిన ఆదర్శ కోశాధికారి ప్రవల్లిక





**గోకవరం,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–** గురువారం సాయంత్రం నన్నయ యూనివర్సిటీలో జరిగిన మౌఖిక పరీక్షల్లో ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కోశాధికారి ప్రవల్లికకు డాక్టరేట్ అవార్డు పొందడం జరిగిందని సెక్రెటరీ నాగమణి తెలియజేశారు. నన్నయ యూనివర్సిటీ లో జరిగిన పీహెచ్. డి మౌఖిక పరీక్షలను ఏపీ కళాశాలల ఫీజు నియంత్రణ కమిషనర్ కార్యదర్శి బి సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్లో ఎంపిక చేసిన జిల్లాల దృష్టి మహిళా సాధికారికతలో స్వయం సహకార బృందాల పాత్ర పై జరిపిన పరిశోధనలపై అడిగిన ప్రశ్నలకు సవివరంగా అద్భుతంగా ప్రదర్శించి మౌఖిక పరీక్షకు హాజరైన వారందరూ మంత్రముగ్ధు లైనరు. డాక్టరేట్ పొందిన ప్రవల్లిక మాట్లాడుతూ నాకు దిశా నిర్దేశం చూపించిన మా గైడ్ స్వర్గీయ డాక్టర్ టేకి సార్ మరియు ప్రస్తుత గైడ్ డాక్టర్ ఉదయ్ భాస్కర్ ఎంతో సహకరించారని వారికి ధన్యవాదాలు తెలుపుతూ నా పురోగతికి ఎంతో సహకరించిన నా తల్లితండ్రులకు లైన్ కనకరాజు, డాక్టర్ నాగమణి లకు పాదాభివందనమని మరియు వెన్నంటే సహకరించిన నా భర్త సంతోష్ ప్రత్యేక ధన్యవాదములు అని, నా పీహెచ్డీ పుస్తకం తయారీలో సహకరించిన మా అక్క డాక్టర్ హారిక బావగారు ఇంజనీర్ సంతోష్ మరియు మా అత్తగారు మావయ్య గారు అయినా రాణి సత్యనారాయణ యొక్క సహకారం ధన్యవాదములు డాక్టర్ ప్రవల్లిక తెలియచేశారు. డాక్టర్ అవార్డు పొందిన డాక్టర్ ప్రవల్లికకు ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ వైఫ్ ప్రిన్సిపాల్ సుజిని కోఆర్డినేటర్ శ్రీనివాస్, కామేష్, ప్రేమ్ కుమార్, డాక్టర్ కుందరాజు, డాక్టర్ పైడిరాజు, డాక్టర్ గణేష్, డాక్టర్ పవన్, డాక్టర్ నీతికా రెడ్డి, శిరీష, రత్న జ్యోతి. విజయ, అలేఖ్య, దుర్గ భవాని, దివ్య క్రాంతి ఆదర్శ హై స్కూల్ హెడ్మాస్టర్ సత్యనారాయణ, రామారావు, పట్నాయక్, జయ, మూర్తి, రవి, తదితర అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పొదలకూరులో తొలిసారిగా పాలీసెట్ ఎంట్రన్స్

### - ప్రశాంతంగా ముగిసిన పరీక్ష




**పొదలకూరు,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**విద్యా రంగంలో పొదలకూరు పట్టణానికి ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ ఏడాది తొలిసారిగా ఇక్కడ పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం నాలుగు మండలాల విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలిగించింది. ఇంతకుముందు ఈ పరీక్ష రాయడానికి నెల్లూరు వరకు వెళ్లాల్సి వచ్చేది. అయితే ఈసారి అధికారులు విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి, పొదలకూరులోనే కేంద్రాన్ని ఏర్పాటు చేయడం విశేషం.పట్టణంలోని డివిఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. శనివారం నిర్వహించిన ఈ పరీక్షలో పొదలకూరు మాత్రమే కాకుండా పరిసర మండలాల నుంచి మొత్తం 206 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. పరీక్షకు గంట ముందుగానే, అంటే ఉదయం 10 గంటల నుంచే విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు.పరీక్ష సమయం దగ్గరపడుతున్న కొద్దీ, కొంతమంది విద్యార్థులు చివరి నిమిషంలో కేంద్రానికి చేరుకునేందుకు పరుగులు తీయడం కనిపించింది. పరీక్షా కేంద్రం వెలుపల తల్లిదండ్రులు ఆందోళనగా వేచి ఉండగా, లోపల విద్యార్థులు తమ భవిష్యత్తుకు కీలకమైన ఈ పరీక్షను ప్రశాంతంగా రాశారు.ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కాలేజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సూరా రాజగోపాల్ రెడ్డి, బాలురు ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సిహెచ్ సురేష్ లు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని తెలిపారు. తాగునీరు, ప్రథమ చికిత్స, పోలీసు బందోబస్తు వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు.పరీక్ష నిర్వహణలో ఎటువంటి అంతరాయాలు లేకుండా సజావుగా పూర్తి కావడం విశేషం. మొదటిసారిగా కేంద్రం ఏర్పాటు అయినప్పటికీ, అధికారులు తీసుకున్న జాగ్రత్తల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.తల్లిదండ్రులు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, తమ పిల్లలను దగ్గరలోనే పరీక్ష రాయించగలిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

## కాప్రాలో బ్యాండ్ కళాకారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**కాప్రా,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**తెలంగాణ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కాప్రా చెరువు సమీపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీశైలం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాండ్ కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు పూర్తి అయిన కళాకారులకు పింఛన్, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. అలాగే కళాకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని సూచించారు.ఇటీవలి కాలంలో సౌండ్ పొల్యూషన్ పేరుతో రాత్రి 10 గంటల ముందు నుంచే బ్యాండ్ వాహనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి సీజ్ చేయడం వల్ల కళాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. దీనికి కారణమైన 227 జీవోను రద్దు చేసి, బ్యాండ్ వాహనాలను సీజ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మేడ్చల్ జిల్లా కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా శ్రీశైలం, జిల్లా అధ్యక్షుడిగా రాచర్ల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చింతల శేఖర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాగేష్, టింకు, మహముదిన్, అనిల్ కుమార్, బస్వరాజ, కాశిప్ప, చంద్రమౌళి, సహాయ కార్యదర్శులుగా డేవిడ్, హనుమంత్, చరణ్, సంపత్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సంతోష్, హరీష్, గణేష్, మంజునాథ్, గోపాల్, వీరుని ఎంపికయ్యారు. సమావేశం చివరలో నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ కళాకారుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## బుడతడి టాలెంట్‌కు ప్రోత్సాహం

### - అభినందించిన నాగార్జున స్కూల్ యాజమాన్యం




**పొదలకూరు,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–** చిన్న వయసులోనే అసాధారణమైన ప్రతిభను కనబరిచి అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్న బుడతడు యశ్వంత్ కుమార్. పొదలకూరులోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఈ ఫస్ట్ క్లాస్ విద్యార్థి తన అద్భుత జ్ఞాపకశక్తితో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాడు.పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో యశ్వంత్ ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్రాల పేర్లు అడగగానే వాటి రాజధానులను వెంటనే చెప్పడమే కాకుండా,సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దేశ ప్రధానమంత్రి పేర్లను కూడా ఎలాంటి తడబాటు లేకుండా టకటక చెప్పడం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది. చిన్నారి సమాధానాల్లో స్పష్టత, వేగం చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.సాధారణంగా ఈ వయసులో పిల్లలు అక్షరాలు, పదాలు నేర్చుకునే దశలో ఉంటారు. కానీ యశ్వంత్ మాత్రం తన వయసును మించి ఉన్న జ్ఞానాన్ని ప్రదర్శిస్తూ ప్రత్యేకతను చాటుకున్నాడు. అతని ఈ ప్రతిభ వెనుక తల్లిదండ్రులు సాంబార్ రవిచంద్ర, నందిని చూపుతున్న శ్రద్ధతో పాటు పాఠశాల ఉపాధ్యాయుల సహనం, మార్గదర్శకత్వం ఉన్నాయి.చిన్నారి ప్రతిభను గుర్తించిన పాఠశాల నిర్వాహకులు అన్నం సుబ్బారావు, ఎ చంద్రశేఖర్, జి.వి.ఆర్, ప్రిన్సిపాల్ లక్ష్మీ దుర్గతో పాటు ఉపాధ్యాయులు యశ్వంత్‌ను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఇలాంటి ప్రతిభావంతులైన చిన్నారులను ప్రోత్సహించడం సమాజ బాధ్యతని, సరైన మార్గదర్శకత్వం ఉంటే పిల్లలు ఏ స్థాయికైనా ఎదగగలరని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తెలిపింది. తమ పాఠశాలలోని విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని వివరించింది.

## ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం ఎమ్మెల్యే సత్యప్రభ






**శంఖవరం/ఏలేశ్వరం,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం. ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి ఎర్రవరం సిపిఎం కర్మాగారం యజమాన్యం దాతృత్వంతో అందజేసిన జనరేటర్ ను,ఏలేశ్వరం దాతల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన విశ్రాంతి షెడ్డును ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ఆస్పత్రికి జనరేటర్ ను అందజేసిన సీపీఎఫ్ యాజమాన్యానికి, విశ్రాంతి షెడ్డును నిర్మించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మెరుగైన వైద్యాన్ని అందిస్తున్న వైద్యులను అభినందించారు.అనంతరం దాతలకు ఎమ్మెల్యే సాలువలతో సత్కరించారు. సిహెచ్సి చైర్మన్ వాగు రాజేష్ మీడియాతో మాట్లాడుతూ సిపిఎఫ్ యాజమాన్యం జనరేటర్ అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే దాతల ఆర్థిక సహకారంతో షెడ్డును ఏర్పాటు చేయడం జరిగిందని, ఆస్పత్రికి ఫ్యాన్లు,రోగులు కూర్చునేందుకు బెంచ్ అందించిన దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బోదిరెడ్డి గోపి,అలమండ చలమయ్య, మూది నారాయణ స్వామి,పసల సూరిబాబు, బుగతా శ్రీను,మైరాల కనకారావు, మామిడి లలిత,మైరాల నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరిడెంట్ రమేష్, సిపిఎఫ్ కంపెనీ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ పీఎంపీల నూతన కమిటీ ఏర్పాటు

### - రెండోసారి పీఎంపీ కోరుకొండ మండల అధ్యక్షుడుగా కుంచే వినోద్ నియామకం

**కోరుకొండ,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–** కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం సర్వసభ సమావేశం, కార్యవర్గ ఎన్నికలు జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు.ముందుగా రాజమండ్రి కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ కు చెందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వి శ్రీరామ్ హాజరై మాట్లాడుతూ నేటి జీవనశైలి కారణంగా ఇబ్బంది పడుతున్న జీర్ణాశయ వ్యాధులు గ్యాస్ట్రిక్ అల్సర్స్,పెప్టిక్ అల్సర్స్, డ్యుడనల్ అల్సర్స్ గురించి, కాలేయం కు సంబంధించిన ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల గురించి వివరించారు. వాస్కులర్ సర్జన్ డాక్టర్ చలుమూరి రష్మీ మాట్లాడుతూ నరాలకు సంబంధించిన రుగ్మతల గురించి,డయాబెటిక్ ఫుట్ అల్సర్ల గురించి వివరించారు.అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికలలో కుంచే వినోద్ మండల నూతన కమిటీ అధ్యక్షులుగాను,సూరిశెట్టి భాస్కర్ నూతన కార్యదర్శిగా,బీహెచ్ శివకుమార్ నూతన కమిటీ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు,నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా పేరారాపు లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా తగరంపూడి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా వి సత్యానందం,గౌరవ సలహాదారులుగా ఖండవల్లి శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులుగా ఏ శేషగిరి,పి జోగారావు,సీహెచ్ గంగాధర్,టి రామకృష్ణ, సీహెచ్ సూరిబాబు లను ఎన్నుకోవడమైనది.ఈ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పీ దేవానందం,జిల్లా కోశాధికారి పి చిన్ని మరియు సభ్యులు కణుపూర్ శ్రీనివాస్, జైత్ర ప్రసాద్,శివశంకర్,మల్లేష్ తదితరులు అభినందించారు.

అక్షర టైమ్స్



# పెట్రోల్,డీజిల్ వదంతులపై ఆందోళన వద్దు : కాకినాడ జేసీ

**కాకినాడ,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–** కాకినాడ జిల్లాలో పెట్రోల్, డీజిల్ పరిస్థితిపై ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. శుక్రవారం కాకినాడలో పెట్రోల్ బంకులను సివిల్ సప్లై అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ తగినంత నిలవలు ఉన్నాయని తెలిపారు. ముందుగా కలెక్టరేట్లో ఆయిల్ కంపెనీల అధికారులతోనూ, సివిల్ సప్లై అధికారులతోనూ జాయింట్ కలెక్టర్ భరత్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

## ‘అరటికాండంతో పప్పు‘ రెసిపీ ..

# ఆరోగ్యానికి ఎంతో మేలు..

ఫిట్‌నెస్‌కి ఎంత ప్రాధాన్యత ఇస్తుంది టాలీవుడ్ హీరోహియిన్ సమీరా రెడ్డి ఎప్పటికప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫిట్‌నెస్ టిప్స్ షేర్ చేసుకుంటుంటారు. హెల్దీగా ఉండే రెసిపీలు, బరువు తగ్గించే వర్కౌట్లను తన అభిమానులతో షేర్ చేసుకుంటుంటారామె. ఈసారి అలానే ఆరోగ్యకరమైన రెసిపీతో ముందుకొచ్చారు. తాను చేసే రెసిపి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో వివరిస్తూ..ఆ కర్రీ తయార చేసే విధానాన్ని తెలియజేశారామె. ఇంతకీ ఏంటా హెల్దీ రెసిపీ అంటే..సమీరా రెడ్డి కడుపుకి మేలు చేసే అరటికాండం పప్పు కూర తయారీ విధానాన్ని పంచుకున్నారు. అందుకోసం ఏమేమి పదార్థాలు కావాలంటే..అరటి కాండం–1(శుభ్రం చేసి, సన్నగా తరిగి నానబెట్టింది) కంది పప్పు లేదా పెసర పప్పు: కప్పుకరివేపాకు 1పసుపు టీ స్పూన్ఆవాలు టీ స్పూన్తాజా కొబ్బరి పేస్ట్–1కాశ్మీరీ మిరపకాయ–1జీలకర్ర– 1 టీస్పూన్ఉప్పు రుచికి సరిపడా తయారీ విధానం: ముందుగా అరటికాండం, పప్పు, పసుపు, ఉప్పు వేసి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించాలి. మొత్తం 6 విజల్స్ వచ్చాక కొబ్బరి పచ్చిమిర్చి,జీలకర్ర కలిపిని పేస్ట్‌ని వేసుకోవాలి. ఆ తర్వాత నెయ్యి వేడి చేసి అందులో ఆవాలు, కాశ్మీరీ మిరపకాయ, కరివేపాకు వేసి తాలింపు పెట్టాలి. ఈ కర్రీ ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్పుకొచ్చారు. అంతేగాదు దీన్నితినడం వల్ల కలిగే లాభాలు కూడా వివరించారు. అవేంటంటే..ఇందులో ఫైబర్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. అలసటను తగ్గించడంలో హెల్ప్ అవుతుందిహార్మోన్ల సమతుల్యతకు మద్దతిస్తుందిప్రేగు ఆరోగ్యం, డిటాక్స్ కోసం అద్భుతమైనదికడుపు ఉబ్బరం, నీరు నిలుపుదలని తగ్గించడంలో సహాయపడుతుంది బరువు నిర్వహణకు సహాయపడుతుంది రుతుక్రమ ఆరోగ్యానికి మంచిది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది జీర్ణక్రియను మెరుగ్గా ఉంచుతుంది. అలాగే పోస్ట్ చివరలో సమీరా ఉడికించిన తర్వాత ఆ అరటికాండం పోగులను తీసివేయాలని, అవి తినకూడదని, జీర్ణం అవ్వడానికి కష్టంగా ఉంటుందని హెచ్చిరించారు. అలాగే ఇలాగే ఇలా తొలగించడం



వల్ల కూర మృదువుగా, మెత్తగా ఉండి సులభంగా తినేయగలుగుతామని కూడా అన్నారామె. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

## బట్టతలకు పర్మినెంట్ సొల్యూషన్..

# తక్కువ టైమ్ లోనే హెయిర్ రీ-గ్రోత్..



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితం, పెరిగిన కాలుష్యం, ఒత్తిడి కారణంగా అతి చిన్న వయసులోనే చాలామంది ‘బట్టతల‘ సమస్యతో సతమతమవుతున్నారు. జుట్టు రాలడాన్ని అడ్డుకోవడానికి రకరకాల నూనెలు, రసాయన మందులు వాడి విసిగిపోయిన వారికి పరిశోధకులు ఇప్పుడు ఒక తీపి కబురు అందించారు. కేవలం కొన్ని వారాల్లోనే సహజ సిద్ధంగా తిరిగి జుట్టు మొలిపించే సామర్థ్యం ఉన్న సరికొత్త ‘ప్లాంట్ బేస్డ్ సీరమ్‘ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. తైవాన్ నేషనల్ యూనివర్సిటీ పరిశోధకులు జరిపిన ఈ ప్రయోగం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైద్య రంగంలో ఆశలు చిగురింపజేస్తోంది.ముఖ్యంగా నేటి యువతలో హెయిర్ ఫాల్ తోపాటు, బాల్డ్ హెడ్ సమస్య మరింతగా పెరుగుతోంది. తైవాన్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చేసిన సరికొత్త ప్రయోగం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రసాయనిక మందుల కంటే సహజ సిద్ధమైన కొవ్వు ఆమ్లాలతో మెరుగైన ఫలితాలు వచ్చినట్లు వైద్యనిపుణులు గుర్తించారు.**మరి ఇది ఎలా పనిచేస్తుంది..**సాధారణంగా మన చర్మానికి గాయం అయినప్పుడు, శరీరం సహజంగానే స్పందిస్తుంది. ఆ సమయంలో చర్మం కింద ఉండే కొవ్వు కణాలు కొన్ని ప్రత్యేకమైన ఫ్యాటీ యాసిడ్లను విడుదల చేస్తాయి. ఇవి నిద్రాణంగా ఉన్న జుట్టు కుదుళ్లను మేల్కొల్పుతాయని శాస్త్రవేత్తలు గమనించారు. ఇదే సూత్రాన్ని ఉపయోగించి, ఎటువంటి గాయం లేకుండానే నేరుగా జుట్టు పెంచేందుకు మొక్కల నూనెల్లో ఉండే ‘ఒలీయిక్ యాసిడ్‘, ‘పామిటోలియిక్ యాసిడ్‘ వంటి సహజ మూలకాలతో ఈ సీరమ్‌ను తయారు చేశారు.**పరిశోధనలో తేలిన ముఖ్యాంశాలు..** ఎలుకలపై చేసిన ప్రయోగంలో కేవలం 20 రోజుల్లోనే దట్టమైన జుట్టు పెరగడం గమనించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న మినాక్సిడిల్ వంటి మందులతో పోలిస్తే, ఈ ప్లాంట్ సీరమ్ వల్ల ఎటువంటి స్కిన్ ఇరిటేషన్ గానీ, హార్మోన్ల మార్పులు సంభవించలేదని తేలింది. ఈ సీరమ్ జుట్టు మూలాల్లోని స్టెమ్ సెల్స్‌ను చురుగ్గా మార్చడం ద్వారా సహజ పద్ధతిలో జుట్టు పెరిగేలా చేస్తోంది.**నిపుణులు ఏమంటున్నారు అంటే..**ఇప్పటివరకు జుట్టు రాలడాన్ని అడ్డుకునే మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కానీ, సహజ పద్ధతిలో రీ–గ్రోత్‌ను ప్రోత్సహించే ఈ సీరమ్ భవిష్యత్తులో బట్టతలకు శాశ్వత పరిష్కారంగా మారే అవకాశం ఉంది. అయితే, మనుషులపై పూర్తిస్థాయి క్లినికల్ ట్రయల్స్ ముగిసిన తర్వాతే ఇది మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుంది“ అని పరిశోధక బృందం తెలిపింది. ఈ పరిశోధన ప్రస్తుతం ప్రయోగ దశలో ఉంది. మార్కెట్లో దొరికే ఏ సీరమ్‌నైనా వాడే ముందు చర్మ వ్యాధి నిపుణులను సంప్రదించాలి.**గమనిక:** ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# నులిపురుగుల ప్రభావం పిల్లల మానసిక ఆరోగ్యంపై ఎలా ఉంటుంది..

నులిపురుగుల ప్రభావం పిల్లల ఆరోగ్యంగాపై తీవ్రంగా చూపిస్తుంది. అంతేకాదు ఇవి పిల్లల శారీరక, మానసిక పెరుగుదలపై కూడా ఎఫెక్ట్ చూపిస్తాయి. రక్తహీనత, పోషకాల లోపం, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారడం, తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు అవుతాయి.చిన్నారుల్లో పలు అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణం నులిపురుగులు. వీటిని నుంచి పిల్లలను రక్షించుకోవాలంటే ఆల్బెండజోల్ మాత్రలు వాడాలి. నులి పురుగులు పిల్లల పొట్టలోకి చేరి మెలిపెడుతూ వారి ఎదుగుదలను అడ్డుకొంటుంటాయి. దీని వల్ల రక్తహీనత, పోషకాహారలోపంతోపాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నులిపురుగుల నివారణకు ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి.ఆల్బెండజోల్ మాత్రలు అంగన్వాడీ కేంద్రాలు, స్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు తిరిగి వైద్య సిబ్బంది పంపిణీ చేస్తుంటారు. 1నుంచి19 ఏళ్ల వయసున్నవారికి నులిపురుగుల మాత్రలు వేసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు.1నుంచి 2 ఏళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ 400 ఎంజీ సగం మాత్ర, 3నుంచి19 ఏళ్లలోపు వారికి 400 ఎంజీ ఫుల్ టాబ్లెట్ వేయాలని డాక్టర్లు సూచిస్తున్నారు.అసలు నులి పురుగులు ఎందుకు వస్తాయి.. పిల్లల్లో నులిపురుగులు రావడానికి ప్రధాన కారణం శుభ్రత లేకపోవడమే. దుమ్ము, ధూళి, మట్టిలో ఆడుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. అందుకోసమే పిల్లల చేతిగోర్లను శుభ్రంగా ఉంచేలా తల్లిదండ్రులు చూసుకోవాలి.భోజనం చేసేటప్పుడు, మూత్ర, మల విసర్జన అనంతరం చేతులు శుభ్రం



చేసుకోవడం పిల్లలకు నేర్పించాలి. పిల్లలు మట్టి, బురదలో ఆడుకున్న తర్వాత శుభ్రంగా స్నానం చేయించాలి. ఆడుకునే సమయంలోకూడా పలు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.నులిపురుగుల ప్రభావం పిల్లల ఆరోగ్యంగాపై తీవ్రంగా చూపిస్తుంది. అంతేకాదు ఇవి పిల్లల శారీరక, మానసిక పెరుగుదలపై కూడా ఎఫెక్ట్ చూపిస్తాయి. రక్తహీనత, పోషకాల లోపం, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారడం, తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు అవుతాయి.ఈ సమస్యల కారణంగా పిల్లలు చదువుపై ఏకాగ్రత చూపలేరు. ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం ద్వారా వీటిని నిర్మూలించవచ్చు. వీటి వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. అందుకోసమే పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఏడాది వయసున్న పిల్లలతోపాటు19 ఏళ్ల వయసున్న వారికి కూడా ఆల్బెండజోల్ టాబ్లెట్స్ తప్పనిసరిగా అందించాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి..

## కొబ్బరి కార్మికులకు కేరా సురక్ష బీమా పథకం..




**శంఖవరం,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**కొబ్బరి కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేరా సురక్ష ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తుంది .రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి అభివృద్ధి బోర్డు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేయనంది కొబ్బరి కార్మికులకు ప్రమాదానికి గురైన మరణించిన శాశ్వత అంగవైకల్యం ఏర్పడిన 7 లక్షలు రూపాయలు బీమా మొత్తం అందజేస్తారు. ఇందుకోసం 956 రూపాయలు ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది.ఈ ప్రీమియం మొత్తం కొబ్బరి అభివృద్ధి బోర్డు 813 రూపాయలు ఏపీ లాబరేటరీ వెల్ఫేర్ బోర్డు 100 రూపాయలు చెల్లిస్తాయి. కార్మికుడికి కేవలం 43 రూపాయలు ప్రేమించి చెల్లిస్తే సరిపోతుంది . సురక్ష కేర ఇన్సూరెన్స్ పథకం చేయించుకుని కొబ్బరి కార్మికులు దరఖాస్తు రూపంలో తో పాటు ఆధార్ కార్డు బ్యాంకు బుక్కు జిరాక్సు జతపరిచివెలిసి ఉంటుంది. కొబ్బరి కార్మికులందరికు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరుతున్నాను.

## జనసేన నాయకుడు సోమిరెడ్డి కుశ రాజు వదిన మృతి

– వారి కుటుంబాన్ని పరామర్శించిన జనసేన నాయకుడు తలపాటి బుజ్జి



**శంఖవరం,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం గిడజం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సోమిరెడ్డి కుశ రాజు వదిన ఇటీవల స్వర్గస్తులైనారు వారి కుటుంబాన్ని పరామర్శించిన ప్రతిపాడు నియోజకవర్గ జనసేన నాయకులు తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యంగారు,శంకవరం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి, రౌతులపూడి మండల జనసేన పార్టీ నాయకులు టీ జయగంట, షేక్ సలీమ్,బి. నానాజీ,టీ. ప్రసాద్, కీర్తి నాగు శంఖవరం మండల జనసేన నాయకుడు తలపంటి వీరబాబు పాల్గొన్నారు.

## అక్షింతల రాజా కుటుంబాన్ని పరామర్శించిన తోట నరసింహం





**గోకవరం,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆధ్యాత్మికవేత్త,రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు అక్షింతల రాజా తల్లి అక్షింతల అలివేలు మంగతాయారు ఇటీవల మృతి చెందడంతో అక్షింతల రాజాని, వారి కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం పరామర్శించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, సమ్మెట మోహన్, కండెల్లి పెద్దిరాజు, బదిరెడ్డి రాంబాబు, బిజ్జి రాజు, బాడితబోయిన చిన్న, మచ్చ మురళి, గోలి చిన్ని, కొల్లాపు అర్జున్ రావు, నందూరు బుజ్జి, వీర్లవెంకటేశ్వరరావు, షేక్ నాగూర్ వల్లి బాబా, బొడ్డపాటి వీర చంద్రం, నీలయ్య,నాగేంద్రుడు తదితరులు ఉన్నారు.

## శ్రీ మహంకాళి రామ్ మందిర్ దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం..

– హాజరైన మందుముల పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, ఏప్రిల్ 25. అక్షర టైమ్స్:** –హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 1 లోని శ్రీ మహంకాళి రామ మందిర్ దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ గా బాబు రావు , సభ్యులుగా విపిన్ అగర్వాల్ ,రఘు సింగమనేని , మల్లాది రమాకాంత్ రెడ్డి ,అమర వాణి మేక , పెద్దోళ్ల విజయలక్ష్మి, రామేశ్వరం ధర్మరాజు,ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ప్రణీత్ ,ఈఓ వెంకన్న ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి ,బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి ,డివిజన్ అధ్యక్షులు విజయ్ ,కంది శ్రవణ్ రెడ్డి , గణేష్ నాయక్, రమేష్ నాయక్, మురళి ముదిరాజ్,విసు , సాగ శ్రీధర్, గంగ, వాసు నాయక్, మరియు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## కాకినాడ స్వర్ణకారుల అభివృద్ధి సంక్షేమానికి చర్యలు..



**కాకినాడ,ఏప్రిల్25.అక్షర టైమ్స్:–**నగరంలో శనివారం నిర్వహించిన స్వర్ణకారుల సంక్షేమ సంఘం సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వంతో చర్చించి స్వర్ణ కారుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చేలా కృషి చేస్తామని ప్రతి నిధులు శనివారం తెలిపారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు హాజరై తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సంఘం బలోపేతానికి, పారదర్శకత కోసం ప్రత్యేకంగా ఒక క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ఎక్సైజ్ పోలీసులకు ఊరట.. బార్ల ఫొటోల నిబంధనలో కీలక మార్పు

**బార్ల ఫొటోలు తీసే నిబంధనపై ఎక్సైజ్ పోలీసులకు ఊరట**
**విశాఖలో రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతితో మారిన నిబంధన**
**ఇకపై సీసీటీవీ ఫుటేజ్ లేదా వీడియో కాల్ ద్వారా బార్ల మూసివేత నిర్ధారణ**
**మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల తక్షణ సాయం.. ఉద్యోగం ఇస్తామని మంత్రి హామీ**
**రూ.1.10 కోట్ల బీమా సాయం అందేలా చూస్తామని వెల్లడి**



ఏపీలో ఎక్సైజ్ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. బార్‌లు మూసివేసిన తర్వాత అర్ధరాత్రి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్న నిబంధనను సడలిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలో విధి నిర్వహణలో ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిబంధనలో మార్పులు చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.విశాఖపట్నం సీతమ్మధార ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సింహాచలం నాయుడు, గురువారం అర్ధరాత్రి విధి నిర్వహణలో భాగంగా బార్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా తాటిచెట్లపాలెం వద్ద వేగంగా వచ్చిన ఓ బైక్ ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన ఎక్సైజ్ శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ దురదృష్టకర సంఘటన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఇకపై ఎక్సైజ్ పోలీసులు అర్ధరాత్రి నేరుగా బార్లకు వెళ్లి ఫొటోలు తీయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. బార్ మూసివేతను నిర్ధారించుకోవడానికి సీసీ కెమెరాల వీడియో ఫుటేజ్‌ను పరిశీలించడం లేదా బార్ సిబ్బందికి వీడియో కాల్ చేయడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవచ్చని ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.మరోవైపు మృతుడు సింహాచలం నాయుడు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు. ఆయన కుటుంబానికి ఎక్సైజ్ శాఖ తరఫున తక్షణమే రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. దీంతో పాటు ఎస్‌బీఐ బీమా పథకం ద్వారా రూ.1.10 కోట్ల పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, సింహాచలం కుటుంబంలో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని మంత్రి ప్రకటించారు.

# కేదార్‌నాథ్‌కు పోటెత్తిన భక్తులు.. మూడు రోజుల్లో 90 వేల మంది దర్శనం

**కేదార్‌నాథ్ ఆలయానికి భారీగా తరలివస్తున్న భక్తులు**
**తొలి మూడు రోజుల్లోనే 90 వేల మందికి పైగా దర్శనం**
**భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**
**అధికారిక సోషల్ మీడియా ద్వారానే సమాచారం తెలుసుకోవాలని సూచన**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్న తర్వాత భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈ యాత్రా సీజన్‌లో ఆలయం తెరిచిన మొదటి మూడు రోజుల్లోనే 90,000 మందికి పైగా యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ నెల 22న బుధవారం హిమాలయాల్లోని ఈ ఆలయ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్న విషయం తెలిసిందే.కేదార్‌పురిలోని యాత్రా ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం రుద్రప్రయాగ్ ఎస్పీ నిహారికా తోమర్ ఈ వివరాలను వెల్లడించారు. "ప్రారంభ రోజుల్లో భక్తుల్లో భారీ ఉత్సాహం కనిపించింది. ఇప్పటివరకు 90 వేల మందికి పైగా యాత్రికులు దర్శనం పూర్తి చేసుకున్నారు" అని ఆమె తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం తొలి రోజైన ఏప్రిల్ 22న అత్యధికంగా 38,000 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రెండో రోజు 25,000 మందికి పైగా, మూడో రోజైన శుక్రవారం మరో 30,000 మందికి పైగా యాత్రికులు కేదార్‌నాథ్ చేరుకున్నారు.భక్తుల భారీ తాకిడి నేపథ్యంలో ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వివరించారు. జనసందోహాన్ని నియంత్రించేందుకు స్థానిక పోలీసులతో పాటు కేంద్ర పారామిలిటరీ బలగాలను కూడా మోహరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఫైర్ సర్వీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. అంతకుముందు జిల్లా మేజిస్ట్రేట్ విశాల్ మిశ్రా, ఎస్పీ నిహారికా తోమర్‌తో కలిసి ఆలయ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు తీసుకుంటున్న చర్యలను వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారు కీలక సూచనలు చేశారు. ప్రయాణానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం కోసం కేవలం పోలీసులు, జిల్లా యంత్రాంగం తాలూకు అధికారిక సోషల్ మీడియా ఖాతాలను మాత్రమే అనుసరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి ఇబ్బందులు పడొద్దని సూచించారు.

# హర్మూజ్ జలసంధిలో మరో ఉద్రిక్తత.. భారత అధికారి ఉన్న నౌకను స్వాధీనం చేసుకున్న ఇరాన్

**హర్మూజ్ జలసంధిలో భారత్‌కు వస్తున్న నౌక ఇరాన్ స్వాధీనం**
**నౌకలో రాజస్థాన్‌కు చెందిన వైస్ కెప్టెన్ సహా 21 మంది సిబ్బంది**
**కాల్పులు జరిగాయని, తామంతా సురక్షితంగా ఉన్నామని తెలిపిన భారత అధికారి**
**తమ వారిని సురక్షితంగా తీసుకురావాలని ప్రభుత్వానికి కుటుంబం విజ్ఞప్తి**



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్ మరో అంతర్జాతీయ నౌకను తన అదుపులోకి తీసుకుంది. భారత్‌కు వస్తున్న 'ఎపామినోండెస్' అనే కంటైనర్ నౌకను హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) స్వాధీనం చేసుకుంది. ఈ నౌకలో వైస్ కెప్టెన్‌గా పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన సంజయ్ మహర్ (38) సహా మొత్తం 21 మంది సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనతో సంజయ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే... సౌదీ అరేబియా నుంచి గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు ఈ నౌక బయలుదేరింది. గత మూడు, నాలుగు రోజులుగా హర్మూజ్ జలసంధి దాటేందుకు క్లియరెన్స్ కోసం వేచి చూస్తోంది. శుక్రవారం జలసంధిలోకి ప్రవేశించగానే ఇరాన్ గార్డ్స్ నౌకను చుట్టుముట్టి కాల్పులకు తెగబడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన తర్వాత సంజయ్ మహర్ తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్ దళాలు నౌకను స్వాధీనం చేసుకున్నాయని, కాల్పుల సమయంలో తామంతా నౌకలోని సురక్షిత ప్రదేశంలోకి వెళ్లామని, ప్రస్తుతం అందరూ క్షేమంగానే ఉన్నామని ఆయన తెలిపినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు."మొదట మీడియా ద్వారా ఈ విషయం తెలిసి మేం చాలా కంగారుపడ్డాం. తర్వాత మా అబ్బాయి ఫోన్ చేసి క్షేమంగా ఉన్నానని చెప్పాడు. అయినప్పటికీ మాకు చాలా ఆందోళనగా ఉంది. నౌకలోని భారతీయులందరినీ సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని మేము ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం" అని సంజయ్ తండ్రి ఓం ప్రకాశ్ మహర్ ఆవేదన వ్యక్తం చేశారు.సంజయ్ కుటుంబ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే జైదీప్ బిహానీని కలిసి విషయాన్ని వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి, తమ వారిని సురక్షితంగా రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లైబీరియా జెండాతో ప్రయాణిస్తున్న ఈ నౌకలో భారత్‌తో పాటు ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్, శ్రీలంక దేశాలకు చెందిన సిబ్బంది ఉన్నట్లు సమాచారం. సుమారు 15 ఏళ్లుగా మర్చంట్ నేవీలో పనిచేస్తున్న సంజయ్, 20 రోజుల క్రితమే డ్యూటీ కోసం ఇంటి నుంచి వెళ్లినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

# బాల్య వివాహాన్ని ఆపడానికి వెళ్లి.. పెళ్లికూతురు చెల్లిని తీసుకెళ్లిన అధికారులు

**గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ఓ గ్రామంలో ఘటన**
**బాల్యవివాహాన్ని ఆపేందుకు వెళ్లిన ఐసీడీఎస్, పోలీసులు**
**అప్పటికే మైనర్ పెళ్లికూతురుని అక్కడి నుంచి తప్పించిన పెద్దలు**
**చెల్లిని పెళ్లికూతురుగా భావించి ఆమెను తీసుకెళ్లిన అధికారులు**
**ఆ తర్వాత పెళ్లి కార్యక్రమాన్ని పూర్తి చేసిన పెద్దలు**



గద్వాల జిల్లాలో ఐసీడీఎస్, పోలీసు అధికారుల నిర్వాకం ఒక మైనర్ బాలిక జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టింది. ఒక చిన్న పొరపాటు వల్ల జరగాల్సిన వివాహం ఆగిపోవాల్సింది పోయి, ఆ పెళ్లి సైలెంట్ గా జరిగిపోయింది. అధికారుల కళ్లు గప్పి పెద్దలు పెళ్లి జరిపించేశారు.ధరూర్ మండలానికి చెందిన యువకుడికి, గద్వాల మైనర్ బాలికకు గత బుధవారం రాత్రి వివాహం జరగబోతోంది. బాల్య వివాహం గురించి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు బుధవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. కానీ, అధికారులు వస్తున్నారన్న సమాచారంతో పెళ్లి కూతురును అప్పటికే పెద్దలు అక్కడి నుంచి తప్పించారు. అక్కడకు వచ్చిన అధికారులు.. అక్కడ ఉన్న పెళ్లి కూతురు చెల్లినే వధువుగా భావించి... కనీసం ఆధార్ కార్డులోని ఫొటోను కానీ, పెళ్లి పత్రికలోని పేరును కానీ సరిపోల్చుకోకుండా ఆమెను సంరక్షణ కేంద్రానికి తరలించారు.తన చిన్న కూతురిని అధికారులు తీసుకెళ్తుంటే పెళ్లికూతురు తల్లిదండ్రులు, పెద్దలు సైలెంట్‌గా ఉండిపోయారు. అధికారులు వెళ్లిన వెంటనే, మైనర్ బాలికకు గుడిలో పెళ్లి జరిపించేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. గద్వాల అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం తెల్లవారుజామున పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లారు. కానీ అప్పటికే వధూవరులు గ్రామం నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# విషవాయువుల గనిగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్

**గంటకు 6 టన్నుల మీథేన్ విడుదల**
**ప్రపంచంలో అత్యధిక మీథేన్ వెలువరించే ప్రాంతాల్లో యార్డ్‌కు 4వ స్థానం**
**గంటకు 5.9 టన్నుల మీథేన్ విడుదల.. 10 లక్షల కార్ల కాలుష్యంతో సమానం**
**నిర్వహణ లోపంతో లక్ష టన్నుల చెత్త పేరుకుపోవడమే ప్రధాన కారణం**
**చుట్టుపక్కల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిపుణుల ఆందోళన**



జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్.. విషవాయువుల గనిగా మారిందని, ఇది హైదరాబాద్ నగరానికి పెను ముప్పుగా పరిణమించిందని ఓ అంతర్జాతీయ నివేదిక హెచ్చరించింది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (లాస్ ఏంజెలెస్) సాఫ్ట్ మీథేన్ ప్రాజెక్టులో భాగంగా జరిపిన పరిశీలనలో ఈ యార్డ్ నుంచి గంటకు 5.9 టన్నుల మీథేన్ గ్యాస్ వెలువడుతున్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మీథేన్ ఉద్గారాలు వెలువడుతున్న 25 ప్రాంతాల్లో జవహర్‌నగర్ నాలుగో స్థానంలో నిలవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ యార్డ్ వల్ల తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని స్థానికులు ఏళ్లుగా చేస్తున్న ఆరోపణలకు ఈ నివేదిక బలం చేకూర్చింది.నిపుణుల అంచనా ప్రకారం జవహర్‌నగర్ నుంచి వెలువడుతున్న మీథేన్ ఉద్గారాలు... ఏకకాలంలో 10 లక్షల కార్లు ప్రయాణించినా లేదా 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బొగ్గును మండించినా వెలువడే కాలుష్యంతో సమానం. ఈ జాబితాలో ముంబైలోని ఓ డంపింగ్ యార్డ్ గంటకు 4.9 టన్నుల మీథేన్‌తో 12వ స్థానంలో ఉంది. వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయంగా జరుగుతోందంటూ జీహెచ్ఎంసీ, రాంకీ ఎన్విరో సంస్థలు చేస్తున్న ప్రకటనలు పూర్తిగా అవాస్తవమని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం నగరంలోని మూడు కార్పొరేషన్ల నుంచి రోజూ సగటున 9,600 టన్నుల చెత్త జవహర్‌నగర్‌కు చేరుతోంది. అయితే, అక్కడ ఉన్న యంత్రాల సామర్థ్యం రోజుకు కేవలం 1000 నుంచి 1200 టన్నుల చెత్తను మాత్రమే వేరు చేయగలదు. దీంతో తడి, పొడి చెత్తను వేరు చేయకుండానే కుప్పలుగా పోస్తున్నారు. ఫలితంగా యార్డులో నిత్యం 80 వేల నుంచి లక్ష టన్నుల చెత్త పేరుకుపోయి, దాని నుంచి భారీగా మీథేన్ గ్యాస్ విడుదలవుతోంది.ఈ మీథేన్ వాయువు కార్బన్ డయాక్సైడ్ కంటే 25 రెట్లు అధికంగా భూతాపానికి కారణమవుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల గాలిలో ఆక్సిజన్ తగ్గి తలతిరగడం, శ్వాస సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మీథేన్‌కు మండే స్వభావం ఉండటంతో భారీ అగ్నిప్రమాదాలు జరిగే ముప్పు కూడా పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# యమునలో స్నానం చేస్తుండగా వీడియోలు తీశారని విషం తాగిన ఇద్దరు బాలికలు

**యూపీలో చిత్రకూట్ జిల్లాలో యమునా నది వద్ద ఘటన**
**కుటుంబ సభ్యులు మందలించడంతో బాలికల మనస్తాపం**
**నిందితుల కోసం మూడు పోలీసు బృందాల గాలింపు**



యమునా నదిలో స్నానం చేస్తుండగా కొందరు వ్యక్తులు రహస్యంగా వీడియో తీయడంతో మనస్తాపానికి గురైన ఇద్దరు టీనేజ్ అమ్మాయిలు ఆత్మహత్యకు యత్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.16, 17 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలికలు విషం సేవించారని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి సమాచారం అందినట్లు జిల్లా ఎస్పీ అరుణ్ కుమార్ సింగ్ తెలిపారు. పోలీసులు అక్కడికి చేరుకునేలోపే వారిని మెరుగైన చికిత్స కోసం మొదట కార్వీలోని జిల్లా ఆసుపత్రికి, ఆ తర్వాత బాందాలోని రాణి దుర్గావతి మెడికల్ కాలేజీకి తరలించారు.ఆసుపత్రికి తరలిస్తుండగా బాలికలు పోలీసులతో తమ ఆవేదనను పంచుకున్నారు. గురువారం తాము యమునా నదిలో స్నానం చేస్తుండగా కొందరు వ్యక్తులు తమ ఫోటోలు, వీడియోలు తీశారని చెప్పారు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు తమను మందలించారని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురై విషం తాగినట్టు వివరించారు.ఈ ఘటనపై విచారణ చేపట్టేందుకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అరుణ్ కుమార్ సింగ్ వెల్లడించారు. ఒక బృందం బాలికల చికిత్సను పర్యవేక్షిస్తుండగా, రెండో బృందం కుటుంబ సభ్యులతో సమన్వయం చేసుకుంటోందని తెలిపారు. మూడో బృందం వీడియోలు తీసిన నిందితుల కోసం గాలిస్తోందని ఆయన పేర్కొన్నారు.యమునలో స్నానం చేస్తుండగా వీడియోలు తీశారని విషం తాగిన ఇద్దరు బాలికలు

# హైదరాబాద్‌లో వేలాది గొంతుకలతో హనుమాన్ చాలీసా పారాయణం

**మైహోమ్ అవతార్‌లో హిందూ మహా సమ్మేళన్**
**21 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం**
**ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్**
**హనుమ సాధనతో ధైర్యంగా సాగాలని యువతకు పిలుపు**



హైదరాబాద్‌లోని మైహోమ్ అవతార్ గ్రౌండ్స్‌లో హిందూ మహా సమ్మేళన్ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది భక్తులు పాల్గొని 21 సార్లు హనుమాన్ చాలీసాను పఠించడంతో మైదానంలో భక్తి వాతావరణం నెలకొంది.హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ అధ్యక్షులు దేవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సమన్వయకర్తలు చంద్రశేఖర్ గాంధీ, శ్రీమతి జగన్మోహిని, జమలాపురం రాధాకృష్ణ కీలక పాత్ర పోషించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత, శ్రీశైల దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ హాజరు కాగా, సీనియర్ పాత్రికేయులు రాకా సుధాకర్ రావు, అహం టాక్స్ అధినేత్రి మోనికారెడ్డి ప్రసంగించారు.ఈ సందర్భంగా పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహావీరుడైన హనుమంతుడిని స్ఫూర్తిగా తీసుకుని, ఆయన సాధనతో ఈతరం యువత ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. అంతకుముందు రాకా సుధాకర్ రావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు యువత నడుం బిగించాలని కోరారు. హిందూ ఐక్యత ఆవశ్యకతను తన ప్రసంగంలో వివరించారు.శ్రీమతి జగన్మోహిని పర్యవేక్షణలో సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సామూహిక పారాయణ కార్యక్రమంలో దాదాపు నాలుగు వేల మంది పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా నిలిచిన పురాణపండ శ్రీనివాస్‌తో యువత సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. భాగ్యనగరంలో ఇటీవల జరిగిన భక్తి కార్యక్రమాలలో ఈ సమ్మేళనం విజయవంతమైందని, ఇంతటి బృహత్కార్యాన్ని నిర్వహించిన నిర్వాహక బృందాన్ని పలువురు అభినందించారు.

# కవిత 'టీఆర్ఎస్' పార్టీపై కాంగ్రెస్ విమర్శలు

**బీఆర్ఎస్ కు టీఆర్ఎస్ తోకపార్టీ అన్న రామ్మోహన్ రెడ్డి**
**బీఆర్ఎస్ లో అంతర్భాగమే టీఆర్ఎస్ అని వ్యాఖ్య**
**అంతా 'గ్యాస్' అంటూ కాంగ్రెస్ నేత సెటైర్**




కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన'ను ప్రకటించిన కొద్దిసేపటికే రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా ఆమె తన తండ్రి కేసీఆర్ ను 'మరమనిషి' అని సంబోధించడం, రేవంత్ రెడ్డిని పాలనను 'హిట్లర్ పాలన'తో పోల్చడం సంచలనంగా మారింది. కవిత టీఆర్ఎస్ పార్టీపై టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు.కవిత పెట్టిన 'తెలంగాణ రాష్ట్ర సేన' స్వతంత్రమైనది కాదని, అది బీఆర్ఎస్ పార్టీకి ఒక 'తోక పార్టీ' మాత్రమేనని రామ్మోహన్ రెడ్డి అన్నారు. తండ్రి కేసీఆర్, తనయ కవిత ఇద్దరూ ఒక్కటేనని.. బాపు నడిపే బీఆర్ఎస్ లో అంతర్భాగమే ఈ కొత్త టీఆర్ఎస్ అని ఎద్దేవా చేశారు. "తలా తోక ఎప్పటికీ ఒక్కటే... బాపు బీఆర్ఎస్ అంతర్భాగమే తనయ టీఆర్ఎస్.. అంతా గ్యాస్ " అని సెటైర్ వేశారు.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్

సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.



## లక్నవరం సరస్సు..



నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

## శామీర్‌పేట్ లేక్..



హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హోటళు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

## డిండి..



నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

## కొండపోచమ్మ




నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

## అనంతగిరి




ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది.ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

## కీసరపోదాం..



ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు..'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు.. సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

## రాచకొండ కోట..



నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి.

## శ్రీరాం సాగర్..




హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకూర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు.

## శ్రీశైలం..



ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చర వంటివి ఉన్నాయి.

## నల్లమల అడవులు..



నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో క్యాంపింగ్ చేయడం ఎంతో కిక్కిస్తుంది. ప్రకృతివనంలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ప్రకృతి అందాలతో నిండిన ఈ ప్రాంతంలో పర్యాటకుల సాహసాలను, ఉత్కంఠభరితమైన కార్యకలాపాలను ఆస్వాదించొచ్చు. సాహస భరిత అనుభూతిని పొందేందుకు సరైన డెస్టినేషన్ ఇది. పర్వతారోహణ, శివాలయం, కంబం సరస్సు అందుబాటులో ఉండే ప్రాంతాలు.

## సిటీ చుట్టూ థీమ్‌లు..




ఓఆర్ఆర్ నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా ఉన్న థీమ్ పార్కులు పర్యాటకులకు ఎంతగానో చేరువయ్యాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం. 13 వద్ద అందుబాటులో ఉంటే వండర్ లా, శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్కేప్ అడ్వెంచర్ వాటర్ థీమ్ పార్కు, శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్, వికారాబాద్ సమీపంలో ఉండే డ్రీమ్ వ్యాలీ వాటర్ పార్కులు, వికారాబాద్, భువనగిరి గుట్టల సమీపంలో ఉండే ట్రెక్కింగ్ స్పాట్లకు ప్రైవేటు టూర్ ఆపరేటర్లతోపాటు తెలంగాణ టూరిజం శాఖ కూడా టూర్లను ఆపరేట్ చేస్తున్నది. వీటికి సిటీ నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలు ఉండగా.. ఒకప్పుడు సిటీ దాటి వెళ్లేవారు కూడా ఈ ప్రాంతాలను ఒక్కసారైన సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## అబ్బురపరిచే పార్కులు..



హైదరాబాద్ శివారులోనే ఉన్న కండ్లకోయ ఆక్సిజన్ పార్కును అడవిలాంటి ఉద్యాన వనం అనవచ్చు. అటవీశాఖ 75 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ పార్కులో 50 వేల పైచిలుకు చెట్లున్నాయి. పెద్దల కోసం యోగా హాల్, వాక్‌వేలు ఉన్నాయి. పిల్లలకు ఆట స్థలాలున్నాయి. ట్రీహౌస్, పక్షులు సీతాకోకచిలుకల పార్కులు ఉన్నాయి. కుటుంబమంతా కలిసి పిక్నిక్ వెళ్లడానికి చక్కని చోటు ఇది. అలాగే కొత్తగూడలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్ ఆహ్లాదాన్ని పంచుతున్నది.





# ఈ ఎలుకలు డ్యామ్ కట్టేస్తాయి!

ఇదిగో ఇక్కడ కనిపిస్తుందే ఆ డ్యామ్ కట్టేసరికి తలప్రాణం తోకకి వచ్చిందనుకో%ౘ% అన్నది తోకను నిమురుకుంటూ ఓ పెద్ద ఎలుక. ముఖ్యంగా పిల్లర్ల కోసం ఆ పెద్ద దుంగలు నరికే సరికి.. సారీ కొరికే సరికి దుంప తెగిందనుకో అంది మరో మధ్య వయసు నారింజ పండ్ల ఎలుక. ఏదేమైనా అందరం కట్టగట్టుకొని ఆనకట్ట కట్టడం భలే ఆనందం అబ్బా ఇంక మన ఇండ్లకు ఏ కాలమైనా సమస్యే లేదు అంది ఓ చిట్టి ఎలుక. ఇదేం కార్టూన్ సినిమా కథ కాదండీ. నిజంగానే ఈ ఎలుకలు సమష్టిగా పనిచేసి నదుల దగ్గర డ్యామ్‌లు కడతాయి. జీవావరణ ఇంజినీర్లుగా వీటికి పేరుంది. ఇంతకీ ఇవి ఎందుకిలా చేస్తాయి.ఇక్కడి చిత్రాల్లో కనిపిస్తున్న ఎలుకలను బీవర్‌లుగా పిలుస్తారు. అమెరికాతో పాటు, యురేషియా ప్రాంతంలో అంటే ఉత్తరార్ధగోళంలో ఎక్కువగా నివసించే వీటి నైపుణ్యాలు అచ్చెరువొందిస్తాయి. పారే నదులు, నదీ పాయలు, సెలయేళ్లలో ఇవి నివసిస్తాయి.డోమ్‌ల ఆకృతిలో ఉండే వీటి ఇండ్లను నిర్మించుకోవడం కోసం తామే ఆ ధారలో ఓ చోట మడుగులను ఏర్పాటు చేసుకొంటాయి. అందుకోసం నదీ ప్రవాహ వేగాన్ని తగ్గించేందుకు ముందుగా నీటి ప్రవాహం అంచున ఉన్న పెద్దచెట్లను తన బలమైన నారింజ రంగు పండ్లతో కొరికి నేల కూలుస్తాయి.ఇవి తమ పళ్లతో 148 అడుగుల ఎత్తు, 45 అంగుళాల చుట్టుకొలత కలిగిన పెద్ద చెట్లను సైతం పడేసినట్టు రికార్డులున్నాయి. వీటి పళ్లలో ఇనుము ఎక్కువగా ఉండటం వల్ల వీటికా రంగు వస్తుందట. ఆ తర్వాత అన్నీ కలిసి ఆ దుంగలను నీటి ప్రవాహం వైపు నెట్టుకొస్తాయి.దుంగలు నిలబడటానికి తమ రెండు చేతులతో గుండ్రాళ్లు, మట్టిని పోగుచేసి ఒక దగ్గరికి తెస్తాయి. అవన్నీ కుదురుకుని నీటి ప్రవాహం నెమ్మదించాక చెట్ల కొమ్మలు, గులక రాళ్లు, ఇసుక, పుల్లలు, గడ్డి ఇలా అన్నింటినీ వేస్తూ ఒక ఆనకట్టను నిర్మిస్తాయి. దీంతో ఆ భాగం ఇండ్లు కట్టుకోవడానికి అనుకూలంగా మారుతుంది.ఇందులో పుల్లలు, రాళ్లూ ఏరుకొచ్చి బోర్లించిన గూడులా తమ ఇండ్లను కట్టుకుంటాయి. తినడానికి, ఉండటానికి, చలికాలం ఆహారం నిల్వ చేసుకునేందుకు వీలుగా విడివిడి భాగాలుగా నిర్మించుకుంటాయి.వీటి ద్వారాలు మాత్రం నీటిలోపలి నుంచి వెళ్లగలిగేలా మాత్రమే ఉంటాయి. అంటే నేల మీది వీటి శత్రువుల నుంచి తప్పించుకోవడానికన్నమాట. ఇక, ఇలా ఆనకట్ట కట్టి నీటి కొలను ఏర్పరచుకోవడం వల్ల నీటి మట్టం నియంత్రణలో ఉంటుంది. దాంతో గడ్డకట్టే చలిలోనూ అడుగున నీరు ఉండి వీటి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇవి ఇలా ఆనకట్ట కట్టడం వల్ల ఆ ప్రాంతంలో చేపలు, కప్పలు, పురుగులతో చక్కటి జీవావరణ వ్యవస్థ కూడా ఏర్పడుతుందట. చలికాలం ముందు డ్యామ్ మెయింటెనెన్స్ పనులను చేసుకుంటాయట బీవర్లు. ప్రకృతిలో ఎన్ని వింతలో కదూ!



# హైదరాబాద్‌లో ఇల్లు కొంటున్నారా

## మే నెలలోపు డీల్ క్లోజ్ చేయకపోతే లక్షలు నష్టపోవడం ఖాయం!

హైదరాబాద్‌లో ఇళ్ల కొనుగోలుదారులు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల బాట పడుతున్నారు. మే నెల నుంచి రిజిస్ట్రేషన్ విలువలు పెరగనుండటమే దీనికి కారణం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో కొత్త అపార్ట్‌మెంట్లపై స్టాంప్ డ్యూటీ భారం లక్షల్లో పెరిగే అవకాశం ఉంది. దీంతో డబ్బు ఆదా చేసుకునేందుకు జనం ఎగబడుతుండటంతో, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో స్లాట్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. కొత్త రేట్లు అమల్లోకి రాకముందే డీల్స్ క్లోజ్ చేసేందుకు ఇన్వెస్టర్లు కూడా వేగంగా అడుగులు వేస్తున్నారు.ఈ ఆకస్మిక ధరల పెంపు మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపేలా ఉంది. ముఖ్యంగా కోకాపేట్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రీమియం ఏరియాల్లో రేట్లు భారీగా పెరగనున్నాయి. దీనివల్ల కొనుగోలుదారులపై అదనంగా రూ. 2 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు స్టాంప్ డ్యూటీ భారం పడే ఛాన్స్ ఉంది. అందుకే, భారీగా డబ్బు ఆదా చేసుకోవాలనుకునే వారికి వచ్చే వారం చాలా కీలకం కానుంది.త్వరలో రాబోతున్న ల్యాండ్ యూజ్ పాలసీ వల్ల వెస్ట్రన్ కారిడార్‌లో ప్రాపర్టీ ధరలు మారే అవకాశం ఉంది. ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం మార్కెట్ ధరలకు అనుగుణంగా సర్కిల్ రేట్లను సవరించాలని చూస్తోంది. దీనివల్ల తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో మార్కెట్ రేట్లకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గుతుంది. కొండాపూర్‌లో కూడా కొత్త నిబంధనల ప్రకారం ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఏప్రిల్ నెలాఖరు కావడంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్స్ విపహైదరాబాద్‌లో ఇల్లు కొంటున్నారా? మే నెలలోపు డీల్ క్లోజ్ చేయకపోతే లక్షలు నష్టపోవడం ఖాయం!హైదరాబాద్‌లో ఇళ్ల కొనుగోలుదారులు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల బాట పడుతున్నారు. మే నెల నుంచి రిజిస్ట్రేషన్ విలువలు పెరగనుండటమే దీనికి కారణం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో కొత్త అపార్ట్‌మెంట్లపై స్టాంప్ డ్యూటీ భారం లక్షల్లో పెరిగే అవకాశం ఉంది. దీంతో డబ్బు ఆదా చేసుకునేందుకు జనం ఎగబడుతుండటంతో, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో స్లాట్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. కొత్త రేట్లు అమల్లోకి రాకముందే డీల్స్ క్లోజ్ చేసేందుకు ఇన్వెస్టర్లు కూడా వేగంగా అడుగులు వేస్తున్నారు.ఈ ఆకస్మిక ధరల పెంపు మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపేలా ఉంది. ముఖ్యంగా కోకాపేట్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రీమియం ఏరియాల్లో రేట్లు భారీగా పెరగనున్నాయి. దీనివల్ల కొనుగోలుదారులపై అదనంగా రూ. 2 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు స్టాంప్ డ్యూటీ భారం పడే ఛాన్స్ ఉంది. అందుకే, భారీగా



డబ్బు ఆదా చేసుకోవాలనుకునే వారికి వచ్చే వారం చాలా కీలకం కానుంది.తెలంగాణలో రిజిస్ట్రేషన్ విలువల పెంపు.. ల్యాండ్ యూజ్ పాలసీ ప్రభావం ఎంతత్వరలో రాబోతున్న ల్యాండ్ యూజ్ పాలసీ వల్ల వెస్ట్రన్ కారిడార్‌లో ప్రాపర్టీ ధరలు మారే అవకాశం ఉంది. ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం మార్కెట్ ధరలకు అనుగుణంగా సర్కిల్ రేట్లను సవరించాలని చూస్తోంది. దీనివల్ల తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో మార్కెట్ రేట్లకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గుతుంది. కొండాపూర్‌లో కూడా కొత్త నిబంధనల ప్రకారం ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఏప్రిల్ నెలాఖరు కావడంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్స్ విపరీతంగా పెరిగాయి. మే నెల డెడ్‌లైన్ లోపు పేపర్ వర్క్ పూర్తి చేసేందుకు చాలామంది బ్యాంక్ లోన్ల కోసం పరుగులు పెడుతున్నారు. డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోని గైడెన్స్ చెక్‌లిస్ట్‌ను ఒకసారి చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తక్కువ రిజిస్ట్రేషన్ ఫీజు ప్రయోజనం పొందాలంటే వేగంగా స్పందించడం చాలా ముఖ్యం.రిజిస్ట్రేషన్ విలువలు పెరగడం వల్ల ప్రారంభంలో ఖర్చులు ఎక్కువైనప్పటికీ, ఇది మెరుగైన పట్టణ ప్రణాళికకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో ఈ మార్పులు నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను స్థిరీకరిస్తాయని వారు భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతానికి మాత్రం కొనుగోలుదారులు డబ్బు ఆదా చేసుకునేందుకు ఉన్న కొద్దిపాటి సమయంపైనే దృష్టి పెట్టారు. ఈ వారంలోనే డీల్ పూర్తి చేసుకుంటే భవిష్యత్తులో భారీ ఆర్థిక ఊరట లభిస్తుంది.రీతంగా పెరిగాయి. మే నెల డెడ్‌లైన్ లోపు పేపర్ వర్క్ పూర్తి చేసేందుకు చాలామంది బ్యాంక్ లోన్ల కోసం పరుగులు పెడుతున్నారు. డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోని గైడెన్స్ చెక్‌లిస్ట్‌ను ఒకసారి చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తక్కువ రిజిస్ట్రేషన్ ఫీజు ప్రయోజనం పొందాలంటే వేగంగా స్పందించడం చాలా ముఖ్యం.రిజిస్ట్రేషన్ విలువలు పెరగడం వల్ల ప్రారంభంలో ఖర్చులు ఎక్కువైనప్పటికీ, ఇది మెరుగైన పట్టణ ప్రణాళికకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో ఈ మార్పులు నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను స్థిరీకరిస్తాయని వారు భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతానికి మాత్రం కొనుగోలుదారులు డబ్బు ఆదా చేసుకునేందుకు ఉన్న కొద్దిపాటి సమయంపైనే దృష్టి పెట్టారు. ఈ వారంలోనే డీల్ పూర్తి చేసుకుంటే భవిష్యత్తులో భారీ ఆర్థిక ఊరట లభిస్తుంది.

# సముద్రంపై ఇండియా పెత్తనం

## హోర్ముజ్ లాగా భారత్ కూడా టోల్ వసూలు చేస్తోందా

ఇటీవల హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకల నుండి ఇరాన్ టోల్ వసూలు చేయాలని చూస్తున్నట్లు వార్తలు రావడంతో ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలైంది. మరి హిందూ మహాసముద్రంలో బలమైన దేశంగా ఉన్న భారత్ కూడా ఇలాంటి టోల్ టాక్స్ వసూలు చేస్తుందా? విదేశీ నౌకలు మన సముద్ర జలాల గుండా వెళ్తున్నప్పుడు భారత్ పన్ను అడిగే హక్కు ఉందా? దీని వెనుక ఉన్న అంతర్జాతీయ చట్టాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. అంతర్జాతీయ సముద్ర చట్టం ఏం చెబుతోంది? ఐక్యరాజ్యసమితికి చెందిన సముద్ర చట్టాల ఒప్పందంప్రకారం, అంతర్జాతీయ జలాల్లో లేదా ఇరుకైన సముద్ర మార్గాల్లో ప్రయాణించే విదేశీ నౌకలపై ఏ దేశం కూడా ఇష్టానుసారంగా టోల్ విధించకూడదు. సముద్రంలో ప్రయాణించే నౌకలకు 'నిర్దోష ప్రయాణం' అనే చట్టబద్ధమైన హక్కు ఉంటుంది. అంటే, ఏ దేశానికి పన్ను కట్టకుండానే నౌకలు సురక్షితంగా ప్రయాణించవచ్చు. ఇరాన్ ఇప్పుడు హోర్ముజ్ లో టోల్ విధించాలని చూడటం అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించడమే అని నిపుణులు అంటున్నారు. భారత్ పన్ను వసూలు చేస్తుందా చాలామంది ఓడరేవుల్లో వసూలు చేసే ఛార్జీలను టోల్ అని పొరబడుతుంటారు. భారత్ తన బందర్లకు వచ్చే నౌకల నుండి 'పైలట్ ఛార్జీలు' లేదా 'సర్వీస్ ఛార్జీలు' వసూలు చేస్తుంది. ఒక నౌక



భారత ఓడరేవులో ఆగితే, అక్కడ అందించే రక్షణ, డాక్ సౌకర్యాల కోసం మాత్రమే ఈ డబ్బు తీసుకుంటారు. ఇది అంతర్జాతీయంగా ఆమోదించబడిన పద్ధతి. అంతేకానీ, కేవలం సముద్రం గుండా వెళుతున్నందుకు పన్ను వసూలు చేయడం అనేది చట్టవిరుద్ధం. భారత్ ఎప్పుడూ అలాంటి పనులు చేయదు. మలక్కా జలసంధిలో భారత్ బలం! వ్యూహాత్మక పరంగా భారత్‌కు అత్యంత కీలకమైన ప్రాంతం మలక్కా జలసంధి. ఇది అండమాన్ నికోబార్ దీవుల సమీపంలో ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గం ద్వారానే చైనాకు కావలసిన 80 శాతం చమురు దిగుమతులు జరుగుతాయి. ఇరాన్ లాగా భారత్ ఇక్కడ టోల్ వసూలు చేయకపోయినా, తన నౌకాదళం ద్వారా నిరంతరం నిఘా ఉంచుతుంది. ఏదైనా అంతర్జాతీయ ఉద్రిక్తతలు తలెత్తితే, ఈ మార్గాన్ని తన అదుపులోకి తీసుకునే సామర్థ్యం భారత్‌కు ఉంది. దీనినే 'సముద్ర నిరాకరణ సామర్థ్యం'అంటారు. భారత్ ఎందుకు టోల్ విధించలేదు హిందూ మహా సముద్రం చాలా విశాలమైనది. ఇక్కడ ఏదో ఒక దేశానికే సార్వభౌమాధికారం ఉండదు. భౌగోళికంగా కూడా భారత్‌కు హోర్ముజ్ లాంటి ఇరుకైన, నియ ంత్రిత మార్గం లేదు. ఇరాన్ వద్ద ఉన్న హోర్ముజ్ జలసంధి చాలా ఇరుకైనది కాబట్టి వారు బ్లాక్ చేసే అవకాశం ఉంటుంది. కానీ భారత్ అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతు ఇస్తుంది. నిఘానే అసలైన ఆయుధం! చైనా నౌకలపై భారత్ ఎందుకు పన్ను వేయకూడదని కొందరు వాదిస్తుంటారు. కానీ భారత్ బలం టోల్ వసూళ్లలో లేదు, నిఘాలో ఉంది. మలక్కా జలసంధి ప్రవేశద్వారం వద్ద కూర్చుని ప్రతి చిన్న కదలికను భారత్ గమనిస్తుంది. ఈ నిఘా వల్ల వచ్చే దౌత్యపరమైన ఒత్తిడి, ఏ టోల్ టాక్స్ ద్వారా వచ్చే ఆదాయం కంటే చాలా శక్తివంతమైనది. భారత్ ఎప్పుడూ శాంతియుత , బాధ్యతాయుతమైన సముద్ర విధానాన్నే అనుసరిస్తుంది.

# రాజ్‌కోట్ నుంచి స్టాక్ మార్కెట్ వరకు




## మెహుల్ టెలికామ్ ఐపీఓ సృష్టించిన సంచలనం!

రాజ్‌కోట్‌కు చెందిన మెహుల్ టెలికామ్ నేడు బీఎస్ఈ ఎస్ఎమ్ఈ ప్లాట్‌ఫామ్‌పై అదిరిపోయే ఎంట్రీ ఇచ్చింది. ఈ స్టాక్ 10 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యి ఇన్వెస్టర్లను ఖుషీ చేసింది. చిన్న పట్టణాల్లోని వ్యాపారాలు కూడా జాతీయ స్థాయి మార్కెట్లలో సత్తా చాటగలవని ఈ కంపెనీ నిరూపించింది. ట్రేడింగ్ ప్రారంభమైన మొదటి గంటలోనే భారీ డిమాండ్ రావడంతో షేర్ ధర మరింత పెరిగింది.ప్రస్తుత మార్కెట్లో ఇన్వెస్టర్లు వేగంగా వృద్ధి చెందే స్మాల్-క్యాప్ కంపెనీల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రాంతీయంగా రాణిస్తున్న కంపెనీలు సంపదను సృష్టించడా నికి ఎస్ఎమ్ఈ విభాగం ఒక మంచి వేదికగా మారింది. ఒక లోకల్ స్టోర్ స్థాయి నుంచి ఐపీఓ వరకు మెహుల్ టెలికామ్ ఎదిగిన తీరు, రీజినల్ రిటైల్ రంగంపై ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోంది.ఈ కంపెనీ గుజరాత్ అంతటా సొంత స్టోర్లతో పాటు ఫ్రాంచైజీల ద్వారా తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. రాజ్‌కోట్ నుంచి మొదలైన ఈ ప్రయాణం, సమర్థవంతమైన నిర్వహణతో వేగంగా విస్తరించింది. అందుకే మార్కెట్లో మంచి లాభాల కోసం చూస్తున్న ఇన్వెస్టర్లు ఈ కంపెనీ బిజినెస్ మోడల్‌పై నమ్మకం ఉంచారు.ఐపీఓ బిడ్డింగ్ చివరి రోజున ఈ ఇష్యూకు ఏకంగా 42 రెట్లు డిమాండ్ లభించింది. ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్లు ఈ సక్సెస్ స్టోరీలో భాగం కావడానికి పోటీ పడ్డారు. సాధారణంగా భారీ డిమాండ్ ఉన్న షేర్లు లిస్టింగ్ రోజున మంచి లాభాలను అందిస్తాయి. నేటి మార్కెట్ రియాక్షన్ చూస్తుంటే, క్వాలిటీ ఉన్న స్మాల్-క్యాప్ షేర్లను కొనేందుకు జనం సిద్ధంగా ఉన్నారని అర్థమవుతోంది.మెహుల్ టెలికామ్ వ్యూహం.. ఇన్వెస్టర్లు గమనించాల్సిన రిస్కులులిస్టింగ్ లాభాలతో పాటు కొన్ని రిస్కులు కూడా ఉంటాయని కొత్త ఇన్వెస్టర్లు గుర్తుంచుకోవాలి. మెయిన్ బోర్డ్ షేర్లతో పోలిస్తే ఎస్ఎమ్ఈ స్టాక్స్‌లో ట్రేడింగ్ సౌలభ్యం తక్కువగా ఉంటుంది. దీనివల్ల ధరల్లో అకస్మాత్తుగా హెచ్చుతగ్గులు వచ్చే అవకాశం ఉంది. దీర్ఘకాలికంగా సంపదను సృష్టించాలనుకునే వారు ఇలాంటి రిస్కులను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను వ్యాపార విస్తరణకు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు ఉపయోగించాలని మేనేజ్‌మెంట్ ప్లాన్ చేస్తోంది. గుజరాత్‌లో ఇప్పటికే బలమైన పునాది వేసుకున్న ఈ కంపెనీ, ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే విజయాన్ని అందుకుంటుందో లేదో విశ్లేషకులు గమనిస్తున్నారు. దీర్ఘకాలిక వృద్ధిని ఆశించే వారికి ఎస్ఎమ్ఈ రంగంలో ఇలాంటి కంపెనీలు మంచి అవకాశంగా కనిపిస్తున్నాయి.

# యుద్ధం వస్తుందని తెలిసి ముందే భారీగా చమురును దాచి పెట్టుకున్న చైనా


నెక్ట్స్ టార్గెట్ అదే ఇక..చైనా వ్యూహాత్మక చతురత, ఆ దేశం తన ప్రయోజనాల కోసం ముందస్తుగా వేసే అడుగులు మరోసారి ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొంటుందని, ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత వల్ల చమురు సరఫరాకు తీవ్ర విఘాతం కలుగుతుందని ముందే ఊహించిన జష్ట్రఅఖు, తన దేశంలో అసాధారణ స్థాయిలో చమురు నిల్వలను సిద్ధం చేసుకుంది.తాజా గణాంకాల ప్రకారం.. చైనా ప్రస్తుతం సుమారు 1.4 బిలియన్ బారెళ్ల చమురు నిల్వలను కలిగి ఉంది. ఇది ఎంతటి భారీ మొత్తం అంటే, అంతర్జాతీయ ఇంధన సంస్థ లోని 32 సభ్య దేశాల వద్ద ఉన్న మొత్తం నిల్వలు (1.2 బిలియన్ బారెళ్లు) కంటే కూడా చైనా వద్ద ఉన్న నిల్వలే అధికంగా ఉండటం గమనార్హం.ప్రస్తుతం ప్రపంచ దేశాలు హార్ముజ్ జలసంధి మూసివేత వల్ల చమురు ధరలు ఆకాశాన్నంటుతుంటే ఆందోళన చెందుతున్నాయి. కానీ, డ్రాగన్ దేశం మాత్రం అత్యంత నిశ్చింతగా కూర్చుని ఉంది. ఈ సంక్షోభాన్ని ముందే పసిగట్టిన చైనా, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే తన చమురు దిగుమతులను ఏకంగా 15.8 శాతం మేర పెంచుకుంది.అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ప్రపంచంలోని ఇతర దేశాలు చమురు కొరతతో కొట్టుమిట్టాడుతున్నా, చైనా తన నిల్వలతో దీర్ఘకాలం పాటు ఎటువంటి ఇబ్బంది లేకుండా మనుగడ సాగించగలదు. యుద్ధం కారణంగా పెరిగిన ధరలను తగ్గించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వ్యూహాత్మక నిల్వల నుంచి 172 మిలియన్ బారెళ్లను విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ, అమెరికా వద్ద ఉన్న మొత్తం నిల్వలు కేవలం 405 మిలియన్ బారెళ్లు మాత్రమే ఉండటం చైనా కంటే తాము ఎంత




వెనుకబడి ఉన్నామో స్పష్టం చేస్తోంది.చైనా తీరు ఎప్పుడూ తన స్వప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తుంది. ప్రపంచం మొత్తం యుద్ధం, ఆర్థిక సంక్షోభం గురించి ఆందోళన చెందుతుంటే, చైనా మాత్రం తన ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి విఘాతం కలగకుండా ముందస్తుగా రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకుంది. హార్ముజ్ జలసంధి గుండా జరిగే రవాణా నిలిచిపోయినా, అంతర్జాతీయంగా బ్యారెల్ చమురు ధర 100 డాలర్లు దాటినా చైనాకు పెద్దగా నష్టం ఉండదు.ఈ ముందస్తు ప్రణాళికే చైనాను ఇతర దేశాల కంటే భిన్నంగా నిలబెట్టింది. డ్రాగన్ దేశం తన స్వార్థం కోసం ఎవరినైనా ఆ ప్రభావం పడకుండా జాగ్రత్త పడుతుందన్న విషయం ఈ చమురు నిల్వల వ్యవహారంతో మరోసారి నిరూపితమైంది.ప్రస్తుత ఇరాన్-అమెరికా ప్రతిష్టంభన నేపథ్యంలో చైనా వైఖరిని గమనిస్తే, ఆ దేశం ఈ సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడమే కాకుండా, భవిష్యత్తులో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను శాసించే స్థాయికి చేరుకునే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా విధిస్తున్న దిగ్బంధనాలు, యుద్ధ హెచ్చరికలు చైనాను పెద్దగా ప్రభావితం చేయలేకపోవడానికి కారణం ఈ భారీ చమురు నిల్వలేనని చెప్పవచ్చు.

## చిన్న షాపు నుంచి స్టాక్ మార్కెట్ వరకు

### మెహుల్ టెలికాం సక్సెస్ వెనుక అసలు కథ!



రాజ్‌కోట్‌కు చెందిన మెహుల్ టెలికాం లిమిటెడ్ నేడు (ఏప్రిల్ 24, 2026) స్టాక్ మార్కెట్‌లో అదిరిపోయే ఎంట్రీ ఇచ్చింది. ఒక్కో షేరు దాదాపు 108 రూపాయల వద్ద లిస్ట్ అయింది. అంటే ఇష్యూ ధర కంటే 10 శాతం ప్రీమియంతో ట్రేడింగ్ ప్రారంభమైందన్నమాట. ఈ మొబైల్ చైన్ నెట్‌వర్క్‌పై ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకానికి ఈ బంపర్ ఓపెనింగ్ నిదర్శనం. ట్రేడింగ్ మొదలైనప్పటి నుంచే ఇన్వెస్టర్లు ఈ షేర్లను కొనేందుకు ఎగబడటంతో భారీ వాల్యూమ్ నమోదైంది. మెహుల్ వి. రాయ్మగియా, హేమాలి ఆర్. రాయ్మగియా అనే ఇద్దరు వ్యవస్థాపకుల కృషి వల్లే ఈ సంస్థ ఇంతటి స్థాయికి చేరింది. ఒక చిన్న షాపును పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మార్చడంలో వీరి విజన్ అద్భుతం. ఐపీఓ బిడ్డింగ్ సమయంలోనే ఇన్వెస్టర్లు ఈ స్మాల్-క్యాప్ ఆఫరింగ్‌పై భారీగా ఆసక్తి చూపారు. అన్ని కేటగిరీల్లోనూ షేర్లకు విపరీతమైన డిమాండ్ కనిపించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో గంట మోగించి రాయ్మగియా కుటుంబ సభ్యులు ఈ విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. మెహుల్ టెలికాం లిమిటెడ్.. జెట్ స్పీడ్ గ్రోత్! గుజరాత్ వ్యాప్తంగా ఈ కంపెనీ జూజూ (కంపెనీ ఓన్డ్ కంపెనీ ఆపరేటెడ్), (ఫ్రాంచైజీ ఓన్డ్ ఫ్రాంచైజీ ఆపరేటెడ్) మోడల్స్‌లో దూసుకుపోతోంది. బ్రాండ్ విలువ తగ్గకుండా వ్యాపారాన్ని వేగంగా విస్తరించడానికి ఈ వ్యూహం బాగా పనిచేసింది. కేవలం రెండేళ్లలోనే ఒక చిన్న సంస్థ నుంచి లిస్టెడ్ కంపెనీగా ఎదగడం విశేషం. భారతీయ మార్కెట్‌లో ఉన్న అపారమైన అవకాశాలకు ఈ కంపెనీ ప్రయాణమే ఒక నిదర్శనం. మెహుల్ టెలికాం ఐపీఓ ప్రయాణం: ముఖ్యమైన ఘట్టాలు 2024లో ఈ సంస్థను టేకోవర్ చేయడంతో అసలు ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి కస్టమర్ల డిమాండ్‌కు అనుగుణంగా రిటైల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించారు. ఒక చిన్న షాపు నుంచి ఐపీఓ వరకు సాగిన వీరి సక్సెస్ స్టోరీ దేశంలోని ఎంతో మంది చిన్న వ్యాపారులకు గొప్ప స్ఫూర్తినిస్తుంది.సంవత్సరం వ్యాపార ప్రయాణంలో కీలక దశలు 2024 మాతృ సంస్థను టేకోవర్ చేయడం 2025 అవుట్‌లెట్ల వేగవంతమైన విస్తరణ 2026 ాాఘీజు ప్లాట్‌ఫామ్‌పై విజయవంతంగా లిస్టింగ్ మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ఈ లిస్టింగ్ రిటైల్ రంగం బలాన్ని చాటిచెబుతోంది. ఇప్పుడు మెహుల్ టెలికాం ఒక పెద్ద కార్పొరేట్ సంస్థగా ఎదిగి, పబ్లిక్ ఇన్వెస్టర్ల పట్ల జవాబుదారీగా మారింది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను ఇతర మార్కెట్లలో విస్తరణకు ఉపయోగించాలని రాయ్మగియా కుటుంబం భావిస్తోంది. సరైన విజన్ ఉంటే స్థానిక బ్రాండ్లు కూడా జాతీయ స్థాయిలో సత్తా చాటగలవని ఈ సక్సెస్ స్టోరీ నిరూపించింది.

## వాట్సాప్ అదిరిపోయే గుడ్ న్యూస్!

### ఇక ఫోన్ పే, గూగుల్ పే అక్కర్లేదు




డైరెక్ట్‌గా రీఛార్జ్! ప్రపంచంలోనే అత్యధికంగా వాడుతున్న మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఇప్పుడు మరో సంచలన ఫీచర్‌ను తన వినియోగదారుల ముందుకు తెచ్చింది. ఇప్పటివరకు కేవలం మెసేజ్‌లు పంపడానికి, వీడియో కాల్స్ మాట్లాడుకోవడానికి మాత్రమే పరిమితమైన వాట్సాప్, ఇప్పుడు మొబైల్ రీఛార్జ్ సర్వీసులను కూడా ప్రారంభించింది. భారత్‌లోని ఆండ్రాయిడ్ , ఐఫోన్ వినియోగదారులందరికీ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రముఖ పేమెంట్ గేట్‌వే సంస్థ 'పేయూ' సహకారంతో వాట్సాప్ ఈ అద్భుతమైన మార్పును చేపట్టింది. రీఛార్జ్ ఎలా చేయాలి వాట్సాప్ లో రీఛార్జ్ చేసుకోవడం చాలా సులభం. మీరు వేరే యూపీఐ యాప్‌లకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే వాట్సాప్ ప్లాట్‌ఫామ్‌పైనే మీ సొంత నంబర్‌ను లేదా మీ స్నేహితులు, కుటుంబ సభ్యుల నంబర్లను రీఛార్జ్ చేయవచ్చు. జియో ఎయిర్ టెల్ , వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన నెట్ వర్క్ ప్రొవైడర్ల ప్రీపెయిడ్ నంబర్లకు ఈ రీఛార్జ్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. వాట్సాప్‌లో ే గుర్తు గమనించారా? మీరు వాట్సాప్ హోమ్ స్క్రీన్ పైభాగంలో ఉన్న ే(రూపాయి) గుర్తును క్లిక్ చేస్తే పేమెంట్ సేవలు కనిపిస్తాయి. గూగుల్ పే, ఫోన్ పే మాదిరిగానే మీరు మీ బ్యాంక్ ఖాతాలను వాట్సాప్ యూపీఐకి లింక్ చేసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు పంపడం, మొబైల్ నంబర్లకు మనీ ట్రాన్స్‌ఫర్ చేయడం వంటి ఫీచర్లు ఇప్పటికే ఉండగా, ఇప్పుడు వీటికి మొబైల్ రీఛార్జ్ సర్వీస్ కూడా తోడైంది. పేయూ సహకారంతో కొత్త సేవలు మెటా , పేయూ సంస్థలు కలిసి ఈ సమాచారాన్ని అధికారికంగా ప్రకటించాయి. ప్రస్తుతం వాట్సాప్ ద్వారా మనీ ట్రాన్సాక్షన్స్ మాత్రమే కాకుండా విద్యుత్ బిల్లులు చెల్లించడం, మెట్రో టికెట్ బుకింగ్ వంటి ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ప్రీపెయిడ్ రీఛార్జ్ కూడా యాడ్ అవ్వడంతో ఇది వినియోగదారులకు ఒకే చోట అన్ని పనులు చేసుకునేలా మారుతోంది. ఈ సేవలు ప్రస్తుతం కొంతమంది వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి, రాబోయే కొన్ని వారాల్లో దేశవ్యాప్తంగా ఉన్న వాట్సాప్ యూజర్లందరికీ ఈ ఫీచర్ లభిస్తుంది. ఇతర యాప్‌ల కంటే వాట్సాప్ ఎందుకు బెటర్ మనం రోజువారీ జీవితంలో వాట్సాప్‌ను నిరంతరం వాడుతుంటాం. కాబట్టి మొబైల్ రీఛార్జ్ చేయడానికి మరో యాప్ ఓపెన్ చేయాల్సిన పనిలేకుండా, చాటింగ్ చేస్తూనే పనులు పూర్తి చేసుకోవడం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వాట్సాప్ వాడకం ఎక్కువ కాబట్టి, సామాన్యులు కూడా సులభంగా రీఛార్జ్ చేసుకునే అవకాశం ఉంటుంది. మొత్తంగా చెప్పాలంటే.. వాట్సాప్ కేవలం సోషల్ మీడియా యాప్ లాగా కాకుండా, ఒక పేమెంట్ పవర్‌హౌస్‌గా మారుతోంది. మీరు ఇంకా మీ వాట్సాప్ అకౌంట్‌ను రీఛార్జ్ కోసం వాడకపోతే, త్వరలో రాబోయే ఈ అప్‌డేట్‌ను ఖచ్చితంగా ట్రై చేయండి!

## మీరు కొన్న ఇల్లు టైమ్‌కు ఇవ్వలేదా

### అయితే ఇలా చేసి కంపెన్సేషన్ పొందండి!




చాలా మంది కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతింటి కలను నెరవేర్చుకోవాలని చూస్తుంటారు. ముఖ్యంగా బెంగళూరు లాంటి నగరాల్లో కోట్లు పోసి లగ్జరీ విల్లాలు కొంటుంటారు. కానీ, కొన్నిసార్లు బిల్డర్లు చెప్పిన టైమ్‌కు ఇల్లు ఇవ్వకుండా సంవత్సరాల తరబడి తిప్పుతుంటారు. ఇలాంటి బాధితులకు కర్ణాటక రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఒక ఊరటనిచ్చే తీర్పునిచ్చింది. నార్త్ బెంగళూరులోని ఒక విల్లా ప్రాజెక్ట్ విషయంలో ఏకంగా రూ. 70 లక్షల పరిహారం చెల్లించాలని బిల్డర్‌ను ఆదేశించింది. అసలేం జరిగింది? బెంగళూరులోని 'ఆఫ్టర్ ది రెయిన్' అనే లగ్జరీ విల్లా ప్రాజెక్ట్‌లో ఒకరు 2014లో రూ. 3.21 కోట్లకు విల్లా బుక్ చేసుకున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత, అంటే 2022లో ప్రస్తుతం ఉన్న కొనుగోలుదారులు ఆ ప్రాజెక్ట్‌ను రూ. 4.77 కోట్లకు రీసేల్‌లో కొన్నారు. బిల్డర్ అనుమతితోనే ఈ ఒప్పందం జరిగింది. అయితే, అగ్రిమెంట్ ప్రకారం 2023 మే నాటికే విల్లాను హ్యాండోవర్ చేయాలి. ఫోటోలు, పేమెంట్ ప్రూఫ్స్ వంటివి సాక్ష్యాలుగా చూపిస్తే న్యాయం త్వరగా జరుగుతుంది. లగ్జరీ ఇల్లు అంటే కేవలం చూడటానికి అందంగా ఉంటే సరిపోదు, అది కరెక్ట్ టైమ్‌కు చేతికి అందాలి. ఆ బాధ్యతను బిల్డర్లు మర్చిపోతే, ఇలాంటి భారీ జరిమానాలు తప్పవు. ఈ తీర్పు బెంగళూరు లోని వేలాది మంది ఇళ్ల కొనుగోలుదారులకు ఒక పెద్ద ధైర్యాన్ని ఇచ్చింది.

# సమీరా రెడ్డి గ్రాండ్ రీ-ఎంట్రీకి సిద్ధం



## స్టార్ హీరో ప్రాజెక్ట్‌తో సెకండ్ ఇన్నింగ్స్

ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి మళ్లీ వెండితెరపై మెరిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె రీ-ఎంట్రీపై వస్తున్న వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందిన సమీరా, పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైంది. అయితే ఇప్పుడు మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఓ స్టార్ హీరో సినిమాలో సమీరా రెడ్డి కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా, ఇప్పుడు తన వయస్సు, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పేరు కోసం కాకుండా, కథలో బలం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో కూడా సమీరా రెడ్డి అభిమానులతో టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ఆమె పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి తన వ్యక్తిగత అనుభవాలను నిజాయితీగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే పలువురు సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో సక్సెస్ సాధిస్తున్న నేపథ్యంలో, సమీరా రీ-ఎంట్రీపై కూడా అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఒక మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు. అయితే ఆమె నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? వంటి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి. మొత్తానికి, సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల హవా మరింత పెరగనుందని అభిమానులు ఆశిస్తున్నారు.




## రామ్ చరణ్ పెద్ది రిలీజ్.. ఆ డేట్‌నే ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ మూవీకి ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఓ ఐటమ్ సాంగ్ మినహా దాదాపు షూటింగ్ అంతా పూర్తయింది. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ మూవీ రెండోసారి కూడా వాయిదా పడింది. ఏప్రిల్ 30న థియేటర్లలోకి రావాల్సిన పెద్దిని జూన్‌కు షిఫ్ట్ చేశారు. అయితే రిలీజ్ తేదీని మాత్రం అఫీషియల్‌గా ప్రకటించలేదు. దీంతో పెద్ది విడుదల తేదీపై నెట్టింట చర్చ మొదలైంది. ఈ మూవీ రిలీజ్ డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెద్దిని జూన్ 25న విడుదల చేస్తారని లేటెస్ట్ టాక్. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కూడా రానుందన్న వార్త హల్‌చల్ చేస్తోంది. ఈ విషయంపై ఇప్పటి వరకు పెద్ది మేకర్స్ స్పందించలేదు. రాబోయే రోజుల్లో పెద్ది రిలీజ్ డేట్‌పై క్లారిటీ రానుంది. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీలోని స్పెషల్ సాంగ్ కోసం శృతి హాసన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

## 'జెట్లీ' ట్రైలర్ విడుదల..

హైదరాబాద్: స్టార్ కమెడియన్‌గా టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన సత్య, ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జెట్లీ'. రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ ట్రైలర్, చూసిన వారిని కడుపుబ్బా నవ్విస్తోంది. ట్రైలర్ ఆద్యంతం సత్య తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్లు, పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి.



## ప్రెగ్నెన్సీలో దీపికా సాహసం.. 'కింగ్' కోసం భారీ యాక్షన్ సీన్స్!

బాలీవుడ్ కింగ్ షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆమె ప్రస్తుతం గర్భవతి కావడంతో ఈ సినిమాలో తన యాక్షన్ సన్నివేశాలకు మేకర్స్ కాస్త విరామం ఇస్తారని అందరూ భావించారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, దీపికా ఏప్రిల్ 21, 22 తేదీల్లో జరిగిన షూటింగ్ షెడ్యూల్‌లో అత్యంత భారీ పోరాట సన్నివేశాల్లో పాల్గొన్నట్లు సమాచారం. చిత్రబృందం ప్రత్యేకంగా రూపొందించిన సెట్‌లో ఆమె ఎంతో ఉత్సాహంగా ఈ యాక్షన్ సీన్స్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, త్వరలోనే సుమారు ఎనిమిది మంది ఫైటర్లతో కూడిన మరో భారీ పోరాట ఘట్టాన్ని ఇసుకలో చిత్రీకరించేందుకు సిద్ధార్థ్ ఆనంద్ ప్రణాళికలు సిద్ధం చేశారు. షారుక్, దీపికా ఇద్దరి కాంబినేషన్‌లో రానున్న ఈ ఇసుక పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలవనుందట. ఇక సినిమా వాయిదా పడుతుందేమో అన్న సందేహాలకు తెరదించుతూ, డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తాజాగా ఒక ప్రత్యేక వీడియో ద్వారా స్పష్టం చేశారు. దీంతో ఈ ఏడాది చివరలో 'కింగ్' బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని అభిమానులు ఖరారు చేసుకున్నారు.

## రాజశేఖర్ చేయాల్సిన 'ఠాగూర్'.. అలా చిరంజీవి చేతుల్లోకి



'ఠాగూర్' పేరు చెప్పగానే మెగాస్టార్ చిరంజీవి గుర్తొస్తారు. ఇందులో ఆయన చెప్పిన డైలాగ్స్, అద్భుతమైన యాక్టింగ్ మరోసారి మదిలో మెదులుతాయి. చెప్పాలంటే చిరు కెరీర్‌లోనే మైలురాయి లాంటి సినిమా ఇది. అయితే ఇదో రీమేక్ అని చాలామందికి తెలీదు. అలానే రాజశేఖర్ చేయాల్సిన ఈ మూవీ.. చిరంజీవి చేతుల్లోకి వచ్చిందనే సంగతి కూడా ఇప్పటి జనరేషన్‌లో చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. ఇప్పుడీ విషయంపై స్వయంగా రాజశేఖర్ స్పందించారు. అప్పట్లో ఏం జరిగిందో బయటపెట్టారు. ''ఠాగూర్' నేను కొనుక్కున్న సినిమా. అడ్వాన్స్ అంతా ఇచ్చేశా. నిర్మాత నా ఫ్రెండే కదా అని ?అగ్రిమెంట్ చేసుకోలేదు. ఠాగూర్ మధు ఉన్నారు కదా! చిరంజీవి కోసం ఆయన వెళ్లి, ప్రొడ్యూసర్‌ని కలిసి ఎక్కువ డబ్బులిస్తానని చెప్పి పట్టుకెళ్లిపోయారు. నేను అగ్రిమెంట్ చేయలేదు కాబట్టి నాకు ఇవ్వలేదు. ఇది జరిగింది' అని రాజశేఖర్ అప్పటి సంగతులు గుర్తుచేసుకున్నారు. శంకర్ దర్శకత్వంలో అర్జున్ చేసిన 'జెంటిల్మన్' సినిమా కూడా తానే చేయాలని.. కానీ 'అల్లరి ప్రియుడు' షూటింగ్ టైంలోనే ఆ అవకాశం రావడంతో తప్పక వదులుకున్నానని రాజశేఖర్ చెప్పారు. దీనిబట్టి అర్థమైంది ఏంటంటే.. సినిమా ఇండస్ట్రీలో తెర వెనక చాలా జరుగుతుంటాయి. కాకపోతే అప్పుడు సోషల్ మీడియా లాంటివి లేకపోవడం నిజాలు బయటకు రాలేదు. ఇప్పుడు ఈయనే చెప్పడంతో జరిగింది ఇది అని అందరికీ క్లారిటీ వచ్చింది. తమిళంలో విజయకాంత్ హీరోగా ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో 'రమణ' సినిమా వచ్చింది. ఇది బ్లాక్‌బస్టర్ కాగా తెలుగులో దీన్నే 'ఠాగూర్'గా రీమేక్ చేశారు. వివి వినాయక్ దర్శకత్వం వహించారు. ఇక్కడ కూడా అద్భుతమైన ఆదరణ దక్కించుకుంది. సూపర్‌హిట్‌గా నిలిచింది. ఒకవేళ ఇది రాజశేఖర్ చేసుంటే ఎలా ఉండేదో మరి?

## తిరుమల శ్రీవారి సేవలో టాలీవుడ్ డైరెక్టర్



టాలీవుడ్ డైరెక్టర్ బాబీ దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతర వీరికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక బాబీ సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం చిరంజీవితో జతకట్టారు. వాల్తేరు వీరయ్య హిట్ తర్వాత మరోసారి ఈ కాంబో రిపీట్ కానుంది. బాబీతో 'మెగా 158' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించనున్న చిత్రం వచ్చే నెలలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్ కాకాజీ అని ఫిక్స్ చేశారని టాక్ వినిపిస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com